

ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక:105 | ఎడిటర్: మేనం శ్యామ్ | గురువారం 05-11-2026 | పేజీలు: 10

సిరా చుక్క

బస్సులకు డోర్లు లేవు..
ప్రాణాలకు భరోసా లేదు!
ఆర్టీసీ మహిళా కండక్టర్ మృతికి
బాధ్యులెవరు?
ఒకప్పుడు బస్సులకు
డోర్లు ఉండేవి..
కానీ నేడు బస్సుల్లో
భద్రత పూర్తిగా కరువైంది!
చిల్లర కోసం చెలరేగిన వివాదం..
ఒక మహిళా కండక్టర్ ప్రాణాలను
బలితీసుకుంది..
ఆమె కుటుంబంలో
తీరని శోకాన్ని మిగిల్చింది!
టికెట్ ఇచ్చే చేతికి రక్షణ లేదు?
ప్రయాణికుల ప్రాణాలకు
భరోసా లేదు?
రోజూ వేల కిలోమీటర్లు
తిరిగే బస్సుల్లో..
కనీస భద్రత కల్పించాల్సిన
బాధ్యత ఎవరిది?
ఒకరి ఆవేశం ఒక ప్రాణాన్ని తీస్తే..
వ్యవస్థ నిర్లక్ష్యం ఎన్నో ప్రాణాలను
ప్రమాదంలోకి నెడుతుంది!
ఇకనైనా కళ్లు తెరవాలి..
ఆర్టీసీ బస్సులకు డోర్లు ఏర్పాటు
చేయడమే గాక కండక్టర్లు, డ్రైవర్ల
భద్రతకు తక్షణమే చర్యలు
చేపట్టి మరో కుటుంబంలో
ఇలాంటి కన్నీళ్లు మిగలకుండా
చూడాలి.

అరుణ్ రెడ్డి పన్నాల,
వికారాబాద్ జిల్లా బ్యూరో చీఫ్

సదర్ సమ్మేళనం తెలంగాణ ఆత్మగౌరవ వేడుక

- సదర్ లో ముఖ్య మంత్రి జోష్
- యాదవ సోదరులకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు
- రాష్ట్ర పండుగగా గుర్తించి రూ.5 కోట్లు కేటాయించాం
- గోల్కొండ ఒకనాటి గొల్లంకొండ
- యాదవుల సేవలు మరువలేనివి
- కులగణనతో యాదవులకు న్యాయమైన వాటా కల్పిస్తాం
- హైదరాబాద్ అభివృద్ధికి యాదవుల సహకారం అవసరం

ప్రజా వాయిస్, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో వైభవంగా నిర్వహించిన శ్రీకృష్ణ సదర్ సమ్మేళనంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదవ సోదరులందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. సదర్ కేవలం యాదవుల పండుగ మాత్రమే కాదని, సమస్త తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీక అని కొనియాడారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో యాదవుల శ్రమ, సహకారం ఎంతో కీలకమని పేర్కొంటూ, భవిష్యత్తులోనూ నగర అభివృద్ధికి తమ వంత సహకారం అందించాలని పిలుపునిచ్చారు.



రాష్ట్ర పండుగగా గుర్తింపు.. రూ.5 కోట్లు

గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా సదర్‌ను అధికారికంగా రాష్ట్ర పండుగగా గుర్తించే సాహసం చేయలేదని రేవంత్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యాదవుల విజ్ఞప్తి మేరకు సదర్‌ను రాష్ట్ర పండుగగా ప్రకటించిందని, వేడుకల నిర్వహణ కోసం రూ.5 కోట్లు కేటాయించిందని వెల్లడించారు. చారిత్రక గోల్కొండ కోట ఒకప్పుడు 'గొల్లంకొండ'గా ప్రసిద్ధి చెందిందని గుర్తుచేశారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చిన వారందరినీ యాదవులు ఆదరించి అక్కున చేర్చుకున్నారని ప్రశంసించారు.

యాదవులకు సముచిత ప్రాధాన్యం

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని సీఎం పేర్కొన్నారు. ఈ గణన ఆధారంగా భవిష్యత్తులో యాదవులకు దక్కాల్సిన న్యాయమైన వాటాను కల్పించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. తమ ప్రభుత్వంలో అనిల్ కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని తెలిపారు. ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు సభ్యురాలిగా నియమించి సముచిత గౌరవం ఇచ్చామని గుర్తుచేశారు.

గోసంరక్షణకు ప్రత్యేక చర్యలు

యాదగిరిగుట్ట దేవస్థానం గోశాలలో గోసంరక్షణకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు. యాదవుల సంప్రదాయాలు, సంస్కృతి, ఆత్మగౌరవానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు యాదవ సోదరులు ప్రభుత్వానికి సహకరించాలని సీఎం కోరారు.



మీర్‌పేట్‌లో అల్లుడి మారణకాండ

- జంట హత్యలు
- కుటుంబ కలహాలతో అత్తింటిపై సిద్ధిఖ్ విచక్షణారహిత దాడి
- అత్త నిరంజన్ బీ, బావమరిది భార్య రేష్మ దుర్మరణం
- భార్య, కుమార్తె, బావమరిది యూసుఫ్‌కు తీవ్ర గాయాలు
- యూసుఫ్ పరిస్థితి విషమం.. ఆస్పత్రిలో చికిత్స
- ఉదయమే ఫిర్యాదు చేసినా రక్షణ కల్పించలేదని బంధువుల ఆరోపణ

2 లో



కుంట్లూరులో నకిలీ నోట్ల ముద్రణ కేంద్రం

- రూ.6.78 కోట్ల కరెన్సీ స్వాధీనం
- అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఎస్‌వోటీ, స్థానిక పోలీసుల సంయుక్త దాడులు
- రూ.500 నకిలీ నోట్లతో పాటు ప్రింటింగ్ యంత్రాలు పట్టివేత
- నలుగురు అరెస్టు.. మరో ముగ్గురిపై కేసులు నమోదు
- క్యాబ్ డ్రైవర్లుగా పనిచేసిన వారే ముఠాగా ఏర్పడి దందా
- పోలీసులమంటూ బెదిరించి గతంలో రూ.5 లక్షల దోపిడీ



ప్రజా వాయిస్, హైదరాబాద్: నకిలీ కరెన్సీ తయారీ, చలామణికి పాల్పడుతున్న అంతరాష్ట్ర ముఠాను ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు రట్టు చేశారు. షాద్‌నగర్ స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్‌వోటీ), అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన మెరుపు దాడుల్లో రూ.6.78 కోట్ల విలువైన రూ.500 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ప్రధాన పాత్ర పోషించిన నలుగురిని అరెస్టు చేయగా, మరో ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి కేసు వివరాలను వెల్లడించారు.

వాహన తనిఖీలతో వెలుగులోకి నెట్‌వర్క్

నకిలీ కరెన్సీ తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు ఈ నెల 1వ తేదీ రాత్రి 10.15 గంటల సమయంలో అబ్దుల్లాపూర్‌మెట్ చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న అనుమానాస్పద కారును ఆపి తనిఖీ చేయగా, అందులో రూ.8 లక్షల విలువైన రూ.500 నకిలీ నోట్లు లభించాయి. కారులో ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించడంతో నకిలీ నోట్ల తయారీ కేంద్రం

మిగతా 2లో

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బరిలో రామచందర్‌రావు?

- మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ అభ్యర్థిగా పేరు ఖరారైనట్లు సమాచారం
- తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించిన బీజేపీ అధిష్ఠానం
- 2028 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పార్టీ వ్యూహాలు
- వరంగల్–ఖమ్మం–నల్గొండ స్థానానికి బీసీ అభ్యర్థి పరిశీలన-
- వన్నాల వెంకటరమణ, భిక్షంగౌడ్ పేర్లపై కసరత్తు

2 లో



ఆరు గంటల్లో రూ.7.80 కోట్ల సైబర్ దోపిడీ

- హైదరాబాద్‌లో ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థకు సైబర్ నేరగాళ్ల షాక్
- కార్పొరేట్ బ్యాంకు ఖాతా నుంచి నగదు స్వాహా
- 83 బ్యాంకు ఖాతాల్లోకి విడతలవారీగా బదిలీ
- నవంబర్ 1న ఉదయం 10.18 నుంచి సాయంత్రం 4.58 గంటల వరకు లావాదేవీలు
- తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు సంస్థ ఫిర్యాదు



ప్రజా వాయిస్, హైదరాబాద్: హైదరాబాద్‌లో సైబర్ నేరగాళ్లు భారీ దోపిడీకి పాల్పడ్డారు. ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థకు చెందిన కార్పొరేట్ బ్యాంకు ఖాతా నుంచి కేవలం ఆరు గంటల వ్యవధిలోనే రూ.7.80 కోట్లను స్వాహా చేశారు. ఈ నగదును ఏకంగా 83 బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేసినట్లు ప్రాథమికంగా వెల్లడైంది. భారీ మొత్తంలో నగదు మాయం కావడంతో సదరు ఫైనాన్స్ సంస్థ యాజమాన్యం ఆందోళనకు గురైంది.

ఆరు గంటల్లోనే నగదు బదిలీలు

నవంబర్ 1వ తేదీ ఉదయం 10.18 గంటలకు సైబర్ నేరగాళ్లు నగదు బదిలీలను ప్రారంభించినట్లు సమాచారం. అదే రోజు సాయంత్రం 4.58 గంటల వరకు లావాదేవీలు కొనసాగాయి. చివరి లావాదేవీ పూర్తయ్యే సమయానికి మొత్తం రూ.7.80 కోట్లు 83 వేర్వేరు బ్యాంకు ఖాతాల్లోకి చేరినట్లు గుర్తించారు.

సైబర్ బ్యూరో దర్యాప్తు

ఈ భారీ మోసంపై ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నగదు బదిలీ అయిన 83 బ్యాంకు ఖాతాల వివరాలను పరిశీలిస్తున్నారు. ఈ ఖాతాల వెనుక ఉన్న వ్యక్తులు, నగదు ఎక్కడికి తరలించారనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది. ఆరు గంటల్లోనే కోట్లాది రూపాయలు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లను గుర్తించేందుకు పోలీసులు చర్యలు ముమ్మరం చేశారు.

తెలంగాణ పట్టణాభివృద్ధికి కేంద్రం రూ.873 కోట్ల సాయం

- అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద ఐదు ప్రాజెక్టులకు ఆమోదం
- మొత్తం రూ.3,892.38 కోట్లతో అభివృద్ధి పనులు
- గోదావరి తాగునీటి ప్రాజెక్టుకు రూ.398.40 కోట్ల కేంద్ర నిధులు
- వరంగల్‌లో వరద నివారణకు రూ.366.25 కోట్లు
- అలంపూర్ ఆలయ పట్టణ అభివృద్ధికి ప్రత్యేక నిధులు

2 లో



బేతుపల్లి చెరువులో విషాదం

- 11 మంది సహాయక సిబ్బంది గల్లంతు
- చెరువులో చిక్కుకున్న ఐదుగురు మత్స్యకారులు
- రక్షణ చర్యల్లో పాల్గొన్న ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది
- పడవలు బోల్తా పడటంతో గల్లంతైన 11 మంది
- రంగంలోకి దిగిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు
- ఘటనపై ఆరా తీసిన సీఎం రేవంత్‌రెడ్డి



ప్రజా వాయిస్, ఖమ్మం: భారీ వర్షాలు ఖమ్మం జిల్లాలో విషాదకర ఘటనకు కారణమయ్యాయి. సత్యపల్లి మండలం బేతుపల్లి చెరువులో చిక్కుకున్న మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లిన 11 మంది ఎన్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది గల్లంతయ్యారు. వరద ఉద్ధృతికి వారు ప్రయాణిస్తున్న పడవలు బోల్తా పడటంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. గల్లంతైన వారి ఆచూకీ కోసం సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

జాలర్లను కాపాడేందుకు వెళ్లి..

భారీ వర్షాలతో బేతుపల్లి చెరువు అలుగు పారుతున్న సమయంలో వలలు ఏర్పాటు చేసేందుకు వెళ్లిన ఐదుగురు మత్స్యకారులు చెరువులో చిక్కుకుపోయినట్లు సమాచారం. గ్రామస్థుల ద్వారా విషయం తెలుసుకున్న అగ్నిమాపక శాఖకు చెందిన ముగ్గురు సిబ్బంది తొలుత పడవలో చెరువులోకి వెళ్లారు. అయితే వారు కూడా అక్కడే చిక్కుకుపోవడంతో రక్షణ చర్యల కోసం అదనపు బృందాలను రంగంలోకి దించారు.

రెండు పడవలు బోల్తా

కొత్తగూడెం నుంచి ఆరుగురు

మిగతా 2లో

భూ వివాదంలో ఏఐ వినియోగంపై హైకోర్టు ఆగ్రహం!

- రైతు వాదనలు వినకుండానే కలెక్టర్ ఉత్తర్వులు
- తాత్కాలికంగా నిలిపివేత
- ఏఐ సమాచారంతో నిర్ణయాలు తీసుకోవడంపై న్యాయస్థానం అభ్యంతరం
- జనగామ కలెక్టర్ ఉత్తర్వులపై హైకోర్టు స్టే
- రెవెన్యూ ఉన్నతాధికారులు, కలెక్టర్, తహసీల్దార్‌కు నోటీసులు
- బాధ్యులపై చర్యల వివరాలు ఇవ్వాలని అడ్వకేట్ జనరల్‌కు ఆదేశం
- తదుపరి విచారణ ఈ నెల 18కి వాయిదా

ప్రజా వాయిస్, హైదరాబాద్: ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంపై తెలంగాణ హైకోర్టు కీలక ప్రశ్నలు లేవనెత్తింది. భూ వివాదాల వంటి కీలక అంశాల్లో వాస్తవాలను పరిశీలించకుండా, బాధితుల వాదనలు వినకుండా ఏఐ రూపొందించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని అధికారులు నిర్ణయాలు తీసుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. జనగామ జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఓ ఉత్తర్వులపై వచ్చిన ఆరోపణలను విచారించిన న్యాయస్థానం.. ఆ ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేసింది.

రైతు వాదనలు వినకుండానే ఉత్తర్వులు

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం పెద్దమడూరు గ్రామానికి చెందిన మేడిపల్లి కొమురయ్య భూ వివాదానికి సంబంధించి హైకోర్టును ఆశ్రయించారు. ప్రత్యర్థులు సమర్పించిన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ సెప్టెంబర్ 8న ఉత్తర్వులు జారీ చేశారని పిటిషనర్ పేర్కొన్నారు. అయితే తన వాదనలు వినకుండా, భూమికి సంబంధించిన రికార్డులు, వాస్తవాలను పూర్తిస్థాయిలో పరిశీలించకుండానే ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు.

ఏఐతో ఉత్తర్వుల తయారీపై అభ్యంతరం

ఏఐ టూల్స్ ద్వారా రూపొందించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది ఎం. మాధవరెడ్డి కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు తమ సొంత విచక్షణతో వ్యవహరించలేదని వాదించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్.వి. శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టారు.భూమి, ఆస్తి హక్కులకు సంబంధించిన వివాదాల్లో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సామాన్య ప్రజలు, రైతులపై తీవ్ర ప్రభావం పడుతుందని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. సంబంధిత పత్రాలను పరిశీలించడం, కేసులోని వాస్తవాలను నిర్ధారించడం, బాధితుల వాదనలు వినడం అధికారుల బాధ్యతని స్పష్టం చేశారు.

కలెక్టర్ ఉత్తర్వులపై తాత్కాలిక స్టే

ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు.. సెప్టెంబర్ 8న జనగామ కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, జనగామ జిల్లా కలెక్టర్, దేవరుప్పుల తహసీల్దార్‌తో పాటు సంబంధిత ప్రైవేటు వ్యక్తులకు నోటీసులు జారీ చేసింది. వారి వివరణలు సమర్పించాలని ఆదేశించింది.

బాధ్యులపై చర్యలేంటి?

రెవెన్యూ శాఖ తరఫున హాజరైన అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ హరిత ఈ అంశం ప్రభుత్వం దృష్టికి వచ్చిందని కోర్టుకు తెలిపారు. తదుపరి చర్యలపై సలహా కోసం అడ్వకేట్ జనరల్ కార్యాలయాన్ని సంప్రదించినట్లు వివరించారు. దీంతో ఈ వ్యవహారంలో బాధ్యులైన అధికారులపై ప్రభుత్వం ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, ఇకపై తీసుకోబోయే చర్యల వివరాలను సమర్పించాలని అడ్వకేట్ జనరల్ ఏ. సుదర్శన్‌రెడ్డిని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది.

పరిపాలనలో ఏఐ వినియోగంపై చర్చ

ప్రభుత్వ కార్యాలయాల్లో ఫిర్యాదుల పరిష్కారం, ఉత్తర్వుల తయారీలో ఏఐ, ఆటోమేషన్ సాధనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఈ కేసు ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రజలు సమర్పించే ఫిర్యాదుల పత్రాలను ఏఐ టూల్స్ ద్వారా విశ్లేషించి సమాధానాలు, ఉత్తర్వుల ముసాయిదాలు రూపొందిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే ఏఐ రూపొందించిన సమాచారాన్ని అధికారులు స్వయంగా పరిశీలించకుండా నిర్ణయాలకు ఉపయోగిస్తే ప్రజల హక్కులకు భంగం కలిగే ప్రమాదం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పరిపాలనలో సాంకేతికతను వినియోగించినా, ప్రజల ఆస్తి హక్కులను ప్రభావితం చేసే నిర్ణయాల్లో అధికారుల స్వతంత్ర పరిశీలన, బాధ్యతాయుతమైన వ్యవహారం తప్పనిసరి అన్న అంశాన్ని ఈ కేసు మరోసారి చర్చకు తెచ్చింది.



బేతుపల్లి చెరువులో విషాదం

మొదటి పేజీ తరువాయి

ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, మరో ఐదుగురు అగ్నిమాపక సిబ్బంది రెండు పడవల్లో చెరువులోకి వెళ్లారు. ఈ క్రమంలో తొలుత చిక్కుకున్న ముగ్గురు అగ్నిమాపక సిబ్బందిని వెనక్కి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. అనంతరం మత్స్యకారులను రక్షించేందుకు మరోసారి వెళ్లిన సమయంలో వరద ఉద్ధృతికి పడవలు బోల్తా పడటంతో 11 మంది గల్లంతైనట్లు సమాచారం.

రంగంలోకి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

సమాచారం అందుకున్న అధికారులు భద్రాచలం నుంచి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను రప్పించారు. గల్లంతైన సిబ్బంది ఆచూకీ కోసం చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, ఎమ్మెల్యే మట్టా రాగమయి ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

పరిస్థితిపై సీఎం ఆరా

బేతుపల్లి చెరువులో పడవలు గల్లంతైన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. గల్లంతైన ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని వీలైనంత త్వరగా సురక్షితంగా బయటకు తీసుకురావడానికి చర్యలు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సూచించారు. ప్రస్తుతం ఘటనాస్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

ఆర్టీసీ మహిళా కండక్టర్ మృతి

- రూ.10 చిల్లర కోసం వాగ్వాదం..
- ప్రయాణికురాలు కిందకు తోసేయడంతో బస్సు చక్రాల కిందపడి తీవ్ర గాయాలు
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఘటన
- మణుగూరు డిపోలో విధులు నిర్వహిస్తున్న గుండ్ల ప్రవళిక మృతి
- నిందితురాలిపై హత్య కేసు నమోదు చేసినట్లు మంత్రి పొన్నం వెల్లడి

ప్రజా వాయిస్, భద్రాద్రి కొత్తగూడెం: క్షణికావేశం ఓ యువతి ప్రాణాలను బలిగొంది. కేవలం రూ.10 చిల్లర విషయంలో జరిగిన వాగ్వాదం చివరకు ఆర్టీసీ మహిళా కండక్టర్ మృతికి దారితీసింది. ప్రయాణికురాలు కండక్టర్‌ను బస్సులో నుంచి కిందకు తోసేయడంతో ఆమె బస్సు చక్రాల కిందపడి తీవ్రంగా గాయపడింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ప్రాణాలు కోల్పోయింది. 24 ఏళ్ల వయసులోనే ఆమె జీవితం అర్ధాంతరంగా ముగియడం ఆర్టీసీ వర్గాల్లో విషాదం నింపింది.

చిల్లర విషయంలో వాగ్వాదం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు డిపో పరిధిలో గుండ్ల ప్రవళిక కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గత నెల 25న అశ్వాపురం మండలం మిట్టగూడెం ప్రాంతంలో బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళతో టికెట్, చిల్లర చెల్లింపు విషయంలో ప్రవళికకు వాగ్వాదం జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో ఇరువురి మధ్య ఘర్షణ తీవ్రరూపం దాల్చింది.

బస్సు చక్రాల కిందపడి తీవ్ర గాయాలు

వాగ్వాదం సందర్భంగా ప్రయాణికురాలు ప్రవళికను బస్సులో నుంచి కిందకు తోసేసినట్లు తెలుస్తోంది. అదే సమయంలో బస్సు చక్రాలు ఆమె రెండు కాళ్లపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ప్రవళిక తుదిశ్వాస విడిచారు.

నిందితురాలిపై హత్య కేసు

కండక్టర్ ప్రవళిక మృతికి కారణమైన మహిళా ప్రయాణికురాలిపై పోలీసులు హత్య కేసు నమోదు చేసినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని ఆయన సూచించారు. ఆర్టీసీ సిబ్బందిపై ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చిన్నపాటి వివాదాలు క్షణికావేశంతో ప్రాణాంతక ఘటనలుగా మారడం ఆందోళన కలిగిస్తోంది.

తెలంగాణ పట్టణాభివృద్ధికి కేంద్రం రూ.873 కోట్ల సాయం

ప్రజా వాయిస్, హైదరాబాద్: తెలంగాణలో పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీ ఆర్థిక సహాయం అందించనుంది. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రాష్ట్రంలోని ఐదు కీలక నగరాభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్ర నేషనల్ అపెక్స్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల మొత్తం అంచనా వ్యయం రూ.3,892.38 కోట్లు కాగా, ఇందులో రూ.873.49 కోట్లను కేంద్ర ప్రభుత్వం సాయంగా అందించనుంది. తాగునీటి సరఫరా, వరద నివారణ, చారిత్రక కట్టడాల పునరుద్ధరణ, పట్టణ మౌలిక వసతుల మెరుగుదలకు ఈ నిధులను వినియోగించనున్నారు.

ఐదు ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు

కేంద్రం ఆమోదించిన ఐదు ప్రాజెక్టుల్లో గోదావరి తాగునీటి పనులకు అత్యధికంగా రూ.398.40 కోట్ల సాయం కేటాయించారు. వరంగల్ నగరంలో వరద నివారణ చర్యలకు రూ.366.25 కోట్లు, వరంగల్ కోట కందకం పునరుద్ధరణకు రూ.52.27 కోట్లు, హనుమకొండ సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ (సీబీడీ) అభివృద్ధికి రూ.42.19 కోట్లు, అలంపూర్ ఆలయ పట్టణ అభివృద్ధికి రూ.14.38 కోట్ల కేంద్ర సాయం అందనుంది.

వరద ముప్పు తగ్గింపు.. చారిత్రక కట్టడాల పునరుద్ధరణ

వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో వరద ముప్పును తగ్గించడంతో పాటు పట్టణ మౌలిక వసతులను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. వరంగల్ కోట కందకం పునరుద్ధరణతో చారిత్రక వారసత్వ సంపదకు పూర్వవైభవం తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. హనుమకొండలో సీబీడీ అభివృద్ధి ద్వారా వ్యాపార కార్యకలాపాలకు అవసరమైన సదుపాయాలను కల్పించనున్నారు.

పర్యాటక రంగానికి ఊతం

అలంపూర్ ఆలయ పట్టణ అభివృద్ధి ప్రాజెక్టుతో ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంలో మౌలిక వసతులు మెరుగుపడనున్నాయి. గోదావరి తాగునీటి పనులతో నీటి సరఫరా వ్యవస్థకు బలం చేకూరనుంది. కేంద్రం ఆమోదించిన ఈ ఐదు ప్రాజెక్టులు అమలైతే తెలంగాణలోని పలు పట్టణాల్లో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు పర్యాటక, వ్యాపార రంగాలకు కూడా కొత్త ఊతం లభించనుంది.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బరిలో రామచందర్‌రావు?

ప్రజా వాయిస్, హైదరాబాద్: తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయడంపై బీజేపీ అధినాయకత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. 2028 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ఇప్పటి నుంచే వ్యూహాలకు పదును పెడుతోంది. హైదరాబాద్ కేంద్రంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాదయాత్ర నిర్వహించడంతో పాటు పార్టీ ముఖ్య నేతలకు దిశానిర్దేశం చేశారు. మరోవైపు త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలు, ఖైరతాబాద్ ఉప ఎన్నికపైనా పార్టీ నాయకత్వం కసరత్తు ప్రారంభించింది.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి రామచందర్‌రావు?

మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు పేరు దాదాపు ఖరారైనట్లు సమాచారం. ఢిల్లీలో జరిగిన పార్టీ పార్లమెంటరీ బోర్డు సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఒకటి, రెండు రోజుల్లో అధిష్ఠానం అధికారికంగా అభ్యర్థిత్వాన్ని ప్రకటించే అవకాశం ఉందని నాయకులు చెబుతున్నారు. గతంలో ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవం రామచందర్‌రావుకు కలిసివస్తుందని పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

రెండో స్థానానికి బీసీ అభ్యర్థి

వరంగల్–ఖమ్మం–నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి బీసీ అభ్యర్థిని ఎంపిక చేయాలని బీజేపీ అధిష్ఠానం నిర్ణయించినట్లు సమాచారం. రెండు ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థుల ఎంపిక కోసం పార్టీ త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసి ఆశావహుల నుంచి పేర్లు సేకరించింది. ఒక్కో స్థానానికి నలుగురి చొప్పున పేర్లతో కూడిన జాబితాను అధిష్ఠానానికి పంపినట్లు తెలుస్తోంది.ఈ క్రమంలో డాక్టర్ వన్నాల వెంకటరమణతో పాటు రిటైర్డ్ ఉపాధ్యాయుడు భిక్షంగౌడ్ పేర్లను పార్టీ పరిశీలిస్తున్నట్లు సమాచారం. భిక్షంగౌడ్ త్వరలో బీజేపీలో చేరే అవకాశముందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ స్థానానికి అభ్యర్థి ఎంపికపై అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఉప ఎన్నికపైనా కసరత్తు

ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు ఖైరతాబాద్ ఉప ఎన్నికపైనా బీజేపీ నాయకత్వం దృష్టి సారించింది. రాష్ట్రంలో పార్టీ సంస్థాగత బలోపేతం, ఎన్నికల సన్నద్ధత, అభ్యర్థుల ఎంపిక వంటి అంశాలపై నేతలకు మార్గదర్శకత్వం చేస్తున్నట్లు తెలుస్తోంది. 2028 ఎన్నికలకు ముందుగానే రాజకీయంగా పట్టు సాధించాలనే లక్ష్యంతో బీజేపీ అడుగులు వేస్తోంది.

కుంట్లూరులో నకిలీ నోట్ల ముద్రణ కేంద్రం

వ్యవహారం బయటపడింది.

కుంట్లూరులో రహస్య ప్రింటింగ్ యూనిట్

అరెస్టయిన వారిని ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడకు చెందిన మడుపోజు కరుణాకర్, కూకట్‌పల్లికి చెందిన చిన్నోళ్ల మాణిక్యరెడ్డి, జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం కొసునూరుపల్లికి చెందిన చెరుకుపల్లి రత్నాకర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా ఎనుగొండకు చెందిన కరణం అజయ్‌కుమార్‌గా గుర్తించారు. వీరితో పాటు పెద్దఅంబర్‌పేటకు చెందిన జెల్లి వెంకటేష్, ఖమ్మం జిల్లాకు చెందిన కుంజ బాలరాజు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం సూరారం గ్రామానికి చెందిన కంపసాటి శ్రీనివాసులు ఈ ముఠాలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.పెద్దఅంబర్‌పేట సమీపంలోని కుంట్లూరులో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని అక్కడ రహస్యంగా నకిలీ నోట్ల ముద్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఆ ఇంటిపై పోలీసులు దాడి చేసి రూ.6.78 కోట్ల నకిలీ నోట్లు, అధునాతన స్కానర్లు, ప్రింటింగ్ యంత్రాలు, నకిలీ నంబర్ ప్లేట్లు, ఇతర ముద్రణ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

యూట్యూబ్, సోషల్ మీడియా ద్వారా నేర్చుకుని..

ముఠాలోని ప్రధాన నిందితులు గతంలో ఒకే సంస్థలో క్యాబ్ డ్రైవర్లుగా పనిచేసినట్లు సీపీ తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో యూట్యూబ్, సోషల్ మీడియా ద్వారా నకిలీ నోట్ల తయారీపై సమాచారం సేకరించారు. ముంబయి, గుజరాత్ ప్రాంతాల నుంచి ఖరీదైన ప్రింటర్లు కొనుగోలు చేసి, ఆన్‌లైన్‌లో అసలు నోట్లకు సరిపోయేలా గ్రీన్ సెక్యూరిటీ థ్రెడ్ ఉన్న కాగితాన్ని తెప్పించారు. రూ.500 నోట్లను అసలైనవాటిని పోలిన రీతిలో ముద్రించి మార్కెట్లో చలామణి చేయాలని పథకం రచించారు.

ఖాకీ అవతారంలో బెదిరింపులు.. దోపిడీలు

నకిలీ నోట్ల చలామణి సమయంలో ఎవరైనా అనుమానం వ్యక్తం చేస్తే పోలీసులమంటూ బెదిరించేందుకు ముఠా సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. నకిలీ పోలీసు గుర్తింపు కార్డులు, డమ్మీ పిస్టళ్లు, వాకీటాకీలతో ఖాకీ అవతారమెత్తి బాధితులను భయపెట్టేవారు. ఇలా గతంలో ఇద్దరిని బెదిరించి సుమారు రూ.5 లక్షల వరకు దోచుకున్నట్లు విచారణలో తేలిందని సీపీ వెల్లడించారు. నిందితుడు మాణిక్యరెడ్డిపై ఆంధ్రప్రదేశ్‌లోని ముదివేడు పోలీస్ స్టేషన్‌లో గతంలో హత్య కేసు కూడా నమోదై ఉన్నట్లు తెలిపారు.నలుగురికి రిమాండ్..

మిగిలిన వారిపై విచారణ

అరెస్టు చేసిన నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు సీపీ తరుణ్ జోషి తెలిపారు. మిగిలిన ముగ్గురు ఇతర కేసుల్లో మహేశ్వరం పోలీసుల అదుపులో ఉన్నందున, వారిని పీటీ వారెంట్‌పై విచారణకు తీసుకుంటామని చెప్పారు. ఈ ముఠా ఆటకట్టించిన ఎస్‌వోటీ, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసు బృందాలను అభినందించి ప్రత్యేక రివార్డులు అందజేశారు. సమావేశంలో మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల పదో తరగతి పరీక్ష ఫీజులు నేనే చెల్లిస్తా: బండి

- ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు భరోసా
- ఈ ఏడాది కూడా పరీక్ష ఫీజుల బాధ్యత తనదేనని ప్రకటన
- ఐదు ప్రాంతాల్లోని 10,959 మంది విద్యార్థులకు లబ్ధి
- అత్యధికంగా కరీంనగర్‌లో 4,356 మందికి ఆర్థిక ఊరట



ప్రజా వాయిస్, కరీంనగర్: పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో ఈ ఏడాది కూడా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల పరీక్ష ఫీజులను తానే చెల్లిస్తానని కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ ప్రకటించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ఈ సహాయం అందించనున్నట్లు వెల్లడించారు.

10,959 మంది విద్యార్థులకు లబ్ధి

బండి సంజయ్ తీసుకున్న ఈ నిర్ణయంతో ఐదు ప్రాంతాల్లోని మొత్తం 10,959 మంది విద్యార్థులకు ఆర్థిక ఊరట లభించనుంది. ప్రాంతాల వారీగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో 3,920 మంది, కరీంనగర్‌లో 4,356 మంది, జగిత్యాలలో 1,087 మంది, సిద్దిపేటలో 1,133 మంది, హుస్నాబాద్‌లో 463 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

విద్యార్థులకు ఆర్థిక భరోసా

పరీక్ష ఫీజుల కారణంగా పేద విద్యార్థులు ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు బండి సంజయ్ వెల్లడించారు. అర్హులైన విద్యార్థుల పరీక్ష ఫీజుల మొత్తాన్ని చెల్లించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

మీర్‌పేట్‌లో అల్లుడి మారణకాండ

ప్రజా వాయిస్, హైదరాబాద్: హైదరాబాద్ శివారులోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధి జయశ్రీ కాలనీలో బుధవారం దారుణ జంట హత్యలు చోటు చేసుకున్నాయి. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆగ్రహానికి గురైన అల్లుడు సిద్ధిఖ్.. అత్తింటి కుటుంబ సభ్యులపై కత్తితో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో అత్త నిరంజన్ బీ, బావమరిది యూసుఫ్ భార్య రేష్మ అక్కడికక్కడే మృతి చెందారు.

అడ్డువచ్చిన వారిపైనా దాడి

దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన నిందితుడి భార్య, కుమార్తెతో పాటు బావమరిది యూసుఫ్‌పైనా సిద్ధిఖ్ కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని ఆస్పత్రికి తరలించగా, యూసుఫ్ పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.

పోలీసులకు ముందే ఫిర్యాదు?

సిద్ధిఖ్ నుంచి ప్రాణహాని ఉందని బాధిత కుటుంబ సభ్యులు బుధవారం ఉదయమే మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. అయినప్పటికీ పోలీసులు తగిన రక్షణ కల్పించలేదని, అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ దారుణం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆరోపణలపై పోలీసుల స్పందన తెలియాల్సి ఉంది.

నిందితుడి కోసం గాలింపు

సమాచారం అందుకున్న పోలీసులు, క్లూస్ టీమ్ ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఘటన అనంతరం పరారైన నిందితుడు సిద్ధిఖ్ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు ముమ్మరం చేశారు. ఈ జంట హత్యల ఘటనతో జయశ్రీ కాలనీ వాసులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.





యువతకు ఉద్యోగ బాట.. కార్మికులకు భరోసా.!

- పోలీసు కొలువుల కోసం 400 మందికి ఉచిత శిక్షణ..
- 11 పుస్తకాలతో స్టడీ మెటీరియల్
- బియ్యం నాణ్యతలో అలసత్వం వద్దు
- ఆరు గోదాంల హమాలీలకు లేబర్ కార్డులు: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కె. నరసింహ

ప్రజా వాయిస్,కోదాడ: నిరుద్యోగ యువతకు పోలీసు కొలువుల సాధనలో చేయూతనిస్తూ.. గోదాం కార్మికుల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కె. నరసింహ కోదాడలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కేఆర్ఆర్ కళాశాలలో పోలీసు ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ పొందుతున్న 200 మంది అభ్యర్థులకు 11 పుస్తకాలతో కూడిన స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. జిల్లావ్యాప్తంగా 400 మందికి శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. కష్టపడి చదివి కొలువులు సాధించాలని యువతకు సూచించారు. అనంతరం బాలాజీనగర్ ఎన్‌డబ్ల్యూసీ గోదాను తనిఖీ చేసి బియ్యం నిల్వలు, నాణ్యతను పరిశీలించారు. పేదలకు పంపిణీ చేసే సన్న బియ్యం విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని అధికారులకు స్పష్టం చేశారు. ఆరు బఫర్ గోదాంలలో పనిచేస్తున్న హమాలీలందరికీ లేబర్ కార్డులు ఇప్పించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమాల్లో కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ సంతోష్ కిరణ్, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, ఇన్స్పెక్టర్లు రామారావు, శివశంకర్, చరమందరాజు, రామకృష్ణారెడ్డి, ఆర్ఎస్ఐలు సాయిరాం, సురేష్, అన్వర్, జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, ఎన్‌డబ్ల్యూసీ మేనేజర్ సందీప్, టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్‌రెడ్డి, అరుణ, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, శిక్షణ అభ్యర్థులు పాల్గొన్నారు.

నిడమానూరు మార్కెట్ కమిటీ పీఠంపై నాగేష్ యాదవ్ గురి

- ఆశావహుల్లో ముందంజలో మాజీ ఎమ్మెల్యే తనయుడు
- మాజీ మంత్రి జానారెడ్డి ఆశీస్సుల కోసం ప్రయత్నాలు?

ప్రజా వాయిస్,నిడమానూరు. నిడమానూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల ప్రయత్నాలు ముమ్మరమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే గుండెబోయిన రామూర్తి యాదవ్ చిన్న కుమారుడు గుండెబోయిన నాగేష్ యాదవ్ పేరు ప్రముఖంగా తెరపైకి వచ్చింది. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారిలో నాగేష్ యాదవ్ ముందంజలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.నాగార్జునసాగర్ నియోజకవర్గంలో యాదవ సామాజిక వర్గం గణనీయమైన సంఖ్యలో ఉండటంతో సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యతనిస్తూ నాగేష్ యాదవ్‌కు అవకాశం కల్పించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యే గుండెబోయిన రామూర్తి యాదవ్‌కు ఉన్న రాజకీయ నేపథ్యం, కుటుంబానికి నియోజకవర్గంలో ఉన్న పరిచయాలు ఆయన అభ్యర్థిత్వానికి బలంగా మారనున్నాయని అనుచరులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ క్రమంలో సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డిని త్వరలోనే మర్యాదపూర్వకంగా కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కేటాయించాలని కోరనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌ల మద్దతు కూడా నాగేష్ యాదవ్‌కు లభించే అవకాశాలున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.మార్కెట్ కమిటీ పదవుల కేటాయింపులో సామాజిక సమీకరణాలు, పార్టీకి చేసిన సేవలు, నాయకుల అభిప్రాయాలు కీలకం కానున్నాయి. ఈ నేపథ్యంలో నాగేష్ యాదవ్‌కు అవకాశం దక్కుతుందా? పార్టీ పెద్దలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? అన్నది నాగార్జునసాగర్ నియోజకవర్గ కాంగ్రెస్ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. ★నిడమానూరు మార్కెట్ కమిటీ పీఠం ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే!★



స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా నర్సింహాచారి

- ప్రధాన కార్యదర్శిగా మహేశ్వర్ చారి ఘన విజయం!
- ప్రశాంతంగా ముగిసిన పెద్దశంకరంపేట స్వర్ణకార సంఘం ఎన్నికలు
- అధ్యక్షుడిగా 21 ఓట్ల మెజార్టీతో ఏ. నర్సింహాచారి గెలుపు
- ప్రధాన కార్యదర్శిగా 26 ఓట్ల ఆధిక్యంతో టీ. మహేశ్వర్ చారి విజయం
- పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించిన ఉపాధ్యాయులు శ్రీనివాస్, కిషోర్



ప్రజా వాయిస్ పెద్దశంకరంపేట: మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి పదవులకు తీవ్ర పోటీ నడుమ ఉత్కంఠభరితంగా ఈ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సంఘం సభ్యులు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సంఘంలో మొత్తం 162 మంది ఓటర్లు ఉండగా, అందులో 147 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.తాజాగా వెలువడిన తుది ఫలితాల ప్రకారం.. అధ్యక్ష పదవికి పోటీ చేసిన ఏ. నర్సింహాచారికి 80 ఓట్లు రాగా, తన సమీప ప్రత్యర్థి ఏ. కృష్ణకాంత్‌కు 59 ఓట్లు వచ్చాయి. దీంతో 21 ఓట్ల ఆధిక్యంతో నర్సింహాచారి అధ్యక్షుడిగా ఘన విజయం సాధించారు. అలాగే ప్రధాన కార్యదర్శి (జనరల్ సెక్రటరీ) పదవికి జరిగిన పోటీలో టీ. మహేశ్వర్ చారికి 84 ఓట్లు రాగా, ప్రత్యర్థి కే. చంద్రశేఖర్‌కు 58 ఓట్లు పోలయ్యాయి. దీంతో 26 ఓట్ల మెజార్టీతో మహేశ్వర్ చారి ప్రధాన కార్యదర్శిగా గెలుపొందారు. ఈ ఎన్నికల ప్రక్రియను ఎన్నికల అధికారులుగా విధులు నిర్వహించిన ప్రభుత్వ ఉపాధ్యాయులు బోయికాడి శ్రీనివాస్, కిషోర్ పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేశారు. ఈ ఎన్నికల్లో పోలింగ్ ఏజెంట్లుగా మోహన్, విష్ణు, సందీప్, శివకుమార్, సతీష్ వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను సంఘం సభ్యులు పూలమాలలతో సత్కరించి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.





నీటిని వృధా చేస్తే జురుమాన అంటారు...?

- పంచాయతీ ట్రాక్టర్ తో పాలిహౌస్కు నీటి సరఫరా
- మరివెళ్లి గ్రామం సర్పంచ్ ఘనకార్యం

ప్రజా వాయిస్ సంగారెడ్డి : లెనినో ప్రభావంతో ఒకవైపు భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని నిర్ధారించిన అధికారులు కనీసం పంచాయతీ నీటిని వృధా చేయవద్దు అన్న ఉద్దేశంతో నల్లాల నీటీని వృధా చేస్తే ఐదు వేల జరిమానా విజయించాలంటూ ప్రభుత్వం జీవో తీసుకువచ్చింది. దాన్ని అమలు చేయవలసిన పంచాయతీ సర్పంచ్ , కార్యదర్శి దర్జాగా పంచాయతీకి సంబంధించిన వాటర్ ట్యాంకర్ ను పాలి హౌస్ కు తరలిస్తూ ప్రజా వాయిస్ కెమెరాకు చిక్కారు . గ్రామం సర్పంచ్ మల్లేశ్వరి అధికార కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్ సతీమణి కావడం గమనార్హం. ఇది కూడా సాక్షాత్తు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న వట్టి పల్లి మండలం మరివెళ్లి గ్రామపంచాయతీలో జరుగుతున్న నీటి దందా. ఒకవైపు ఎల్నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులతో ప్రజలు గుక్కెడు నీటి కోసం ఇబ్బందులు పడుతుంటే.. సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం మార్వెల్లి గ్రామంలో సర్పంచ్ మాత్రం తన స్వార్థం చూసుకుంటున్నారు. గ్రామ భూగర్భ జలాలను కాపాడి ప్రజలకు నీరందించాల్సిన సర్పంచే స్వయంగా నీటి దందాకు తెరలేపారు. గ్రామ బోర్ల సహాయంతో పంచాయతీ ట్రాక్టర్‌ను ఉపయోగించి.. పాలిహౌస్‌కు అక్రమంగా నీటిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు.సింగూరు జలాశయం అడుగంటిపోవడం, వర్షాలు లేక భూగర్భ జలాలు పూర్తిగా పడిపోతుండటంతో రాబోయే రోజుల్లో తీవ్ర నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలిహౌస్‌లు, ఫామ్‌హౌస్‌లకు ప్రభుత్వ పంచాయతీ నీటిని తరలించడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ సెక్రటరీ ఉన్నత అధికారులు వ్యవహారంలో జోక్యం చేసుకుని, అక్రమ నీటి దందాను వెంటనే అరికట్టాలని మార్వెల్లి గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



ప్రమాదకరంగా మల్కాపూర్ వై జంక్షన్ రోడ్డు

- మల్కాపూర్ ఎక్స్ రోడ్ నుంచి మల్లేపల్లి గ్రామాలకు వెళ్లే వై జంక్షన్ రహదారి ప్రమాదకరం

ప్రజా వాయిస్ సంగారెడ్డి : కొండాపూర్: మండల పరిధిలోని మల్కాపూర్ ఎక్స్ రోడ్ నుంచి మల్కాపూర్, మల్లేపల్లి గ్రామాలకు వెళ్లే వై జంక్షన్ రహదారి ప్రమాదకరంగా మారింది. రహదారి ఇరుకుగా ఉండటంతో నిత్యం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే రహదారిపై ప్రతిరోజూ బీరు కంపెనీకి చెందిన భారీ లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. ఎదురెదురుగా భారీ వాహనాలు వచ్చినప్పుడు ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు పక్కకు వెళ్లేందుకు కూడా సరైన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. రహదారి పక్కన మట్టి ఉండటం, తగినంత వెడల్పు లేకపోవడం ప్రమాదాలకు కారణమవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ మార్గం గుండా మల్కాపూర్, మల్లేపల్లి గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు ఈ రహదారిపైనే ఆధారపడుతున్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రహదారి సమస్యను అధికారులు ఇప్పటివరకు పరిష్కరించకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిని వెడల్పు చేయడంతో పాటు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని, భారీ లారీల రాకపోకల విషయంలో కూడా అవసరమైన నియంత్రణ చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు వరం "పీఎం రాహత్"

- రూపాయి ఖర్చు లేకుండా రూ. 1.5 లక్షల వరకు ఉచిత వైద్యం!
- కేంద్ర ప్రభుత్వ సంజీవని
- 112 నంబర్ కు పిలుపునిస్తే చాలు నగదు రహిత చికిత్స!



ప్రజా వాయిస్ ప్రతినిధి: బెల్లంపల్లి టౌన్ రహదారిపై ప్రయాణం ఎప్పుడు ఎలాంటి ప్రమాదానికి దారితీస్తుందో ఎవరూ ఊహించలేరు. ప్రమాదం జరిగిన తక్షణమే అత్యంత కీలకమైన మొదటి గంటను 'గోల్డెన్ అవర్' అంటారు. ఈ సమయంలో సరైన వైద్యం అందితే ఎంతో మంది ప్రాణాలు నిలుస్తాయి. కానీ, చేతిలో డబ్బు లేకనో, ప్రైవేట్ ఆసుపత్రుల ఫీజులకు భయపడో ఎంతో మంది రోడ్డు ప్రమాద బాధితులు సకాలంలో చికిత్స అందక ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి నిస్సహాయ స్థితిలో ఉన్న పేద, మధ్యతరగతి ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అద్భుత పథకమే "పీఎం రాహత్". అయితే, ఇంతటి మహత్తర పథకంపై ప్రజల్లో ఇప్పటికీ కనీస అవగాహన లోపించడం దురదృష్టకరం.

పీఎం రాహత్ అంటే ఏమిటి?

ఈ పథకం పూర్తి పేరు 'రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్ హాస్పిటలైజేషన్ అండ్ అష్యూర్డ్ ట్రీట్‌మెంట్'. దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, లేదా గ్రామీణ, నగర రోడ్లపై మోటారు వాహనాల వల్ల జరిగే ఏ రకమైన రోడ్డు ప్రమాద బాధితులకైనా ఈ పథకం వర్తిస్తుంది.

పథకం ద్వారా లభించే ముఖ్య ప్రయోజనాలు:*

రూ. 1.5 లక్షల వరకు ఉచిత వైద్యం: అర్హులైన ప్రతి రోడ్డు ప్రమాద బాధితుడికి గరిష్టంగా రూ. 1.5 లక్షల వరకు పూర్తిగా ఉచితంగా, నగదు రహిత చికిత్స అందిస్తారు.7 రోజుల వరకు వర్తింపు ప్రమాదం జరిగిన తేదీ నుండి గరిష్టంగా ఏడు రోజుల వరకు ఈ ఉచిత వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి.స్టేబిలైజేషన్ చికిత్స సాధారణ గాయాలైతే 24 గంటలు, తీవ్రమైన ప్రాణాపాయ స్థితి ఉంటే 48 గంటల వరకు బాధితుడిని ప్రమాదం నుండి గట్టెక్కించే అత్యవసర వైద్య ఖర్చులను ప్రభుత్వం భరిస్తుంది.రూపాయి కూడా కట్టనక్కర్లేదు: నెట్‌వర్క్ (ఎంప్యానెల్డ్) ఆసుపత్రుల్లో చేరినప్పుడు బాధితుడి కుటుంబ సభ్యులు ముందస్తుగా ఎలాంటి డిపాజిట్ కానీ, నగదు కానీ చెల్లించాల్సిన అవసరం లేదు.

రైతులను అడ్డుపెట్టుకొని ఎమ్మెల్యే రాజకీయం చేయొద్దు..!

- ఎల్ నీనో ప్రభావంతో భూగర్భజాలాలు అడగంటాయి
- రైతులకు 12 గంటలకు కరెంట్ ఇస్తుంది' కాంగ్రెస్ '
- మల్లన్న సాగర్ నిర్మాణం సమయంలో ఓ రైతు ఆత్మహత్య చేసుకోలేదా..?
- మీ ప్రభుత్వమే కాదా ప్రాజెక్టులు నిర్మించింది
- కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్
- దుబ్బాక ను కరువు ప్రాంతంగా ప్రకటించాలి అనడం హాస్యాస్పదం



ప్రజా వాయిస్/ దుబ్బాక: రైతులను అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేయొద్దని, బీఆర్ఎస్ నేతలు చెప్పే మాటలు రైతులు నమ్మొద్దని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్ అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... దుబ్బాక నియోజకవర్గ రైతుల ను బీఆర్ఎస్ నాయకులు తప్పుడు మాటలు చెప్పి తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. మీ ప్రభుత్వం లోనే కదా ప్రాజెక్టులు నిర్మాణం చేసింది.. కాళేశ్వరం నిర్మించారు ఇప్పుడు కూలిపోతుందని ఆయన గుర్తు చేశారు. జిల్లాలోని మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక సాగర్ నిర్మించి దోశలతో నీళ్ల పోస్తామని చెప్పింది ప్రశ్నించారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని దుబ్బాక ను కరువు నియోజకవర్గంగా ప్రకటించాలని అనడం హాస్యాస్పదమని అన్నారు. మల్లన్న సాగర్ నిర్మాణ సమయంలో 14 గ్రామాల ప్రజలను చెట్టుకు ఒకరిని... గుట్టకొకరులు చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. మల్లన్న సాగర్ నిర్మాణ సమయంలో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని మర్చిపోయారా అని గుర్తు చేశారు.

బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డిని విమర్శించే హక్కు లేదన్నారు. కొత్త ప్రభాకర్ రెడ్డి 10 ఏండ్లు ఎంపీగా, 3 ఏండ్లు ఎమ్మెల్యేగా చేసి త్వరగా పెట్టింది ఏమీ లేదని విమర్శించారు. హైదరాబాదులో ఉండి కొంతమంది నాయకులను రెచ్చగొట్టి కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేయడం సరైంది కాదన్నారు. గతంలో రైతుల కోసం అని శిఖం భూమిలో కూరగాయల మార్కెట్ను కట్టి కోట రూపాయలు వృధా చేసింది మీరు కాదా అని అన్నారు. మీ ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి చెరువు భూమి కబ్జా చేస్తే కేసు కాలేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అమాయక రైతులు అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేయొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మల్లుగారి రాం చంద్రారెడ్డి, నాయకులు శ్రీరామ్ నరేందర్, కటికే బాలరాజ్, ఐరని సాయి తేజ గౌడ్ ఏఏంసి డైరెక్టర్ ఆకుల భరత్ కుమార్, కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





మందుబాబుల ఆగడాలపై స్థానికుల ఆందోళన

- సర్పంచ్, వార్డు సభ్యులతో కూడిన ప్లెక్సీ చించివేత
- చిందరవందరగా మద్యం సీసాలు

ప్రజా వాయిస్ భీమదేవరపల్లి.భీమదేవరపల్లి: మండలంలోని రాంనగర్ మంగళపల్లి గ్రామపంచాయతీ ప్రాంగణంలో కొందరు మందుబాబులు హంగామా సృష్టించారు. సోమవారం రాత్రి గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో మద్యం సేవించిన కొందరు వ్యక్తులు అక్కడ ఏర్పాటు చేసిన గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులతో కూడిన ప్లెక్సీని చించివేశారు. అంతేకాకుండా మద్యం సేవించిన అనంతరం ఖాళీ సీసాలను గ్రామపంచాయతీ ప్రాంగణంలోనే చిందరవందరగా పడవేశారు.గ్రామ ప్రజలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించే గ్రామపంచాయతీ ప్రాంగణంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలో మద్యం సేవిస్తూ, ప్రజాప్రతినిధుల ప్లెక్సీని ధ్వంసం చేయడం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. మద్యం మత్తులో కొందరు వ్యక్తులు తరచూ గందరగోళం సృష్టిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు, పోలీసులు స్పందించి గ్రామపంచాయతీ ప్రాంగణంలో మద్యం సేవించి హంగామా సృష్టించిన వారిని గుర్తించి, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గ్రామంలో దొంగల బీభత్సం

- రంగాపూర్ లో తొమ్మిది ఇళ్లలో చోరీ
- రంగంలోకి దిగిన పోలీసులు



పెబ్బేరు నవంబర్ 4 ప్రజా వాయిస్ మండల పరిధిలోని రంగాపూర్ గ్రామంలో ఒకే రాత్రి ఏకంగా తొమ్మిది ఇళ్లలో భారీ చోరీ జరిగిన సంఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై సమాచారం అందిన వెంటనే కొత్తకోట సీఐ ఓడి రమేష్, పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్ తమ సిబ్బందితో కలిసి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు.బాధిత ఇళ్లను పరిశీలించిన పోలీసులు, క్లూస్ టీమును రంగంలోకి దించారు. క్లూస్ టీమ్ సభ్యులు సంఘటనా స్థలంలో వేలిముద్రలు, ఇతర కీలక ఆధారాలను సేకరించారు. గ్రామంలో ఒకేసారి ఇన్ని ఇళ్లలో దొంగతనం జరగడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.ఈ సందర్భంగా సీఐ ఓడి రమేష్ మాట్లాడుతూ.. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని, ప్రజలు అధైర్యపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. కేసు నమోదు చేసుకుని అన్ని కోణాల్లో దర్యాప్తు వేగవంతం చేసినట్లు పోలీసులు తెలిపారు.



ఈవీఎం గోడౌన్ తనిఖీ

- భద్రతా ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ కీలక సూచనలు
- సీసీ కెమెరాల పనితీరు పరిశీలన

ప్రజావాయిస్/వికారాబాద్:వికారాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.గోడౌన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. భద్రతా ఏర్పాట్లతో పాటు నిర్వహిస్తున్న రిజిస్టర్లను పరిశీలించి, వాటిపై సంతకాలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నెమత్ హోలీ, తహసీల్దార్, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బుద్వేల్ రోడ్ల పనుల్లో నాణ్యతకు తిలోదకాలు

- కమిషన్లకే కక్కుర్తి..?
- ప్రజాధనం ఖర్చు చేసి కాంట్రాక్టర్ల జేబులు నింపుతున్నారా..?
- గోనె పట్టాలు కప్పి... నీళ్లు క్యూరింగ్ కు మంగళం
- పనుల పర్యవేక్షణ గాలికి
- కమిషన్ల వ్యవహారాలపైనే అధికారుల దృష్టా.?
- సిమెంట్ తక్కువ..అవినీతి ఎక్కువ అంటూ బీఆర్ఎస్ నేత రజనీకాంత్ గౌడ్ తీవ్ర విమర్శలు





ప్రజావాయిస్||రాజేంద్రనగర్: రోడ్డు నిర్మాణం పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చవుతోంది..కానీ పనుల్లో నాణ్యత మాత్రం కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారా.? నాణ్యతను పక్కనపెట్టి కమిషన్లకే కక్కుర్తి పడుతున్నారా.? అన్న ప్రశ్నలు బుద్వేల్‌లో జరుగుతున్న సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులపై తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్-19 పరిధిలోని బుద్వేల్ గ్రామంలో చేపడుతున్న సిమెంట్ రోడ్ల పనులపై బీఆర్ఎస్ సీనియర్ నేత రజనీకాంత్ గౌడ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.కోట్లాది రూపాయలతో చేపడుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని విమర్శించారు.రోడ్డు నిర్మాణం అనంతరం సక్రమంగా క్యూరింగ్ చేయాల్సి ఉండగా,గోనె పట్టాలు కప్పి నీళ్లు చల్లడంతోనే సరిపెడుతున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు.కాంట్రాక్టర్లు నిబంధనలను పక్కనపెట్టి తమకు నచ్చినట్లు పనులు చేస్తున్నారని,వారిని నియంత్రించాల్సిన ఇంజినీరింగ్ అధికారులు మాత్రం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణకు దూరంగా ఉంటున్నారని విమర్శించారు.పనుల్లో ఉపయోగించే సిమెంట్ నాణ్యత,కాంక్రీట్ మిశ్రమం, రోడ్డు మందం,క్యూరింగ్ విధానాన్ని తనిఖీ చేయాల్సిన అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు.కమిషన్లకే కక్కుర్తి పడుతున్నారా..? ప్రజాధనం అంటే అంత చులకనా..? అన్న రీతిలో ఆయన అధికారుల తీరును ప్రశ్నించారు.కాంట్రాక్టర్ల నుంచి వచ్చే ప్రయోజనాలపై ఉన్న శ్రద్ధ పనుల నాణ్యతపై ఎందుకు లేదని నిలదీశారు. ప్రజలకు మన్నికైన రోడ్డు అందించాల్సిన బాధ్యతను విస్మరించి,కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహరిస్తే ప్రజాధనానికి రక్షణ ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు.సిమెంట్ తక్కువ.. అవినీతి ఎక్కువ..అన్న చందంగా పనులు సాగుతున్నాయని ఆయన ఘాటుగా విమర్శించారు.నేడు నాసిరకంగా రోడ్లు నిర్మించి రేపు అవి పగుళ్లు, గుంతలతో దెబ్బతింటే మళ్లీ మరమ్మతుల పేరుతో ప్రజాధనాన్నే ఖర్చు చేయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నాణ్యత లోపాలకు కాంట్రాక్టర్లే బాధ్యత వహిస్తారా.? పర్యవేక్షణ చేయని అధికారులపై చర్యలు ఉంటాయా.? అని ప్రశ్నించారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బుద్వేల్‌లో జరుగుతున్న సిమెంట్ రోడ్ల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని,సాంకేతిక నిపుణులతో నాణ్యతా పరీక్షలు నిర్వహించాలని రజనీకాంత్ గౌడ్ డిమాండ్ చేశారు.పనుల్లో నిబంధనల ఉల్లంఘనలు బయటపడితే కాంట్రాక్టర్లతో పాటు బాధ్యులైన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజాధనం ప్రజల కోసమే ఖర్చు కావాలి. కాంట్రాక్టర్ల లాభాల కోసం, కమిషన్ల వ్యవహారాల కోసం కాదు.బుద్వేల్ రోడ్ల నిర్మాణంలో నాణ్యతపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో, ఆరోపణలపై ఎలాంటి విచారణ చేపడతారో వేచి చూడాలి...!

గుంత తవ్వారు.. పూడ్చడం మరిచారు

- కేబుల్ లైన్ అధికారుల నిర్లక్ష్యానికి ఆర్.ఎం.పి డాక్టర్ కు తీవ్ర గాయాలు.

ప్రజా వాయిస్ ఎల్కతుర్తి అధికారుల నిర్లక్ష్యం కాంట్రాక్టర్ ల బాధ్యతరహిత్యం అమాయక ప్రజల ప్రాణాల మీదకు తెస్తోంది. కేబుల్ లైన్ల కోసం రోడ్డు పక్కన గుంతలు తవ్వి వాటిని పూడ్చకుండా అలాగే వదిలివేయడంతో ఓ గ్రామీణ వైద్యుడు తీవ్ర ప్రమాదానికి గురయ్యాడు. ఎల్కతుర్తి మండల పరిధిలోని కోతుల నడుమ గ్రామంలో గల రైతు వేదిక సమీపంలోని జిలుగుల క్రాస్ రోడ్డు వద్ద ఈ దారుణం చోటుచేసుకుంది. ఆడెపు శ్రీ వర్ధన్ అనే ఆర్ఎంపి డాక్టర్ మంగళవారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో తన విధి నిర్వహణలో భాగంగా బైకుపై వెళ్తుండగా ఎదురుగా వడ్ల లోడుతో వస్తున్న ఒక గుర్తు తెలియని ట్రాక్టర్ ఒక్కసారిగా ముందుకు వచ్చింది. ట్రాక్టర్ కు సైడ్ ఇవ్వబోయిన శ్రీ వర్ధన్ రోడ్డు పక్కనే ప్రమాదకరంగా తెరిచి ఉన్న గుంతలోకి బైకుతో సహా దూసుకెళ్లాడు. సదరు గుంతలు ఒక సంస్థ వారు ఆప్టికల్ ఫైబర్ కేబుల్ ఓ ఎఫ్ సి లైన్ల ఏర్పాటు కోసం తవ్వినట్లు స్థానికులు చెప్తున్నారు. గుంతలో పడడంతో శ్రీ వర్ధన్ కు వెన్నుపూసకు శరీర భాగాలపై తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన తోటి వాహనదారులు స్థానికులు వెంటనే స్పందించి క్షేత్రగాత్రుడిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. పనులు ముగిసిన తరువాత గుంతలను పూడ్చి రోడ్డును యధాస్థితికి తీసుకురావాల్సిన బాధ్యతను పూర్తిగా విస్మరించిందని బాధితుడు శ్రీ వర్ధన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు caution boards కూడా ఏర్పాటు చేయకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని వాపోయాడు. ఇంతటి నిర్లక్ష్యానికి కారణమైన ఆ కంపెనీ అధికారులు కాంట్రాక్టర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని తనకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. రోడ్డుపై ఇలాంటి మృత్యు కుపాలను వదిలేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అధికారులపై ఉన్నతాధికారులు నిఘు పెట్టాలని తక్షణమే ఆ గుంతలను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.





బియ్యం లారీ పట్టివేతపై మంథని పోలీసుల మౌనం

- సోమవారం రాత్రి లారీ అదుపులోకి..
- ఇప్పటివరకు అధికారిక ప్రకటన కరువు
- మంథని పోలీస్ స్టేషన్ లో ఏం జరుగుతోంది?

ప్రజా వాయిస్ మంథని పెద్దపల్లి జిల్లా మంథని పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి బియ్యం లోడుతో వెళ్తున్న లారీని పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన చర్చనీయాంశంగా మారింది. తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు బియ్యం లోడుతో వెళ్తున్న లారీని పట్టుకుని మంథని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం.బియ్యం ఎక్కడి నుంచి.. ఎక్కడికి?లారీలో ఉన్న బియ్యం ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారు? ఎక్కడికి తరలిస్తున్నారు? రవాణాకు సంబంధించి అవసరమైన అనుమతులు ఉన్నాయా? బియ్యం ప్రభుత్వ రేషన్‌కు సంబంధించినదా? లేక ప్రైవేటు వ్యాపారానికి చెందినదా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. సంఘటన జరిగి సమయం గడుస్తున్నప్పటికీ, ఈ వ్యవహారంపై మంథని పోలీసులు ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడించకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. లారీని ఎందుకు పట్టుకున్నారు? ఎంత మొత్తంలో బియ్యం ఉంది? ఎవరిపై కేసు నమోదు చేశారు? దర్యాప్తులో ఏం తేలింది? అనే విషయాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందిసాధారణంగా ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు పోలీసులు ప్రాథమిక వివరాలను వెల్లడిస్తుంటారు. అయితే ఈ బియ్యం లారీ వ్యవహారంలో మాత్రం ఇప్పటివరకు అధికారిక సమాచారం బయటకు రాకపోవడంతో ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల మంథని పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంటున్న పలు వ్యవహారాలపై ఇప్పటికే చర్చ జరుగుతున్న నేపథ్యంలో, తాజాగా బియ్యం లారీ పట్టివేత ఘటనకు సంబంధించిన వివరాలను కూడా పోలీసులు వెల్లడించకపోవడం ఆసక్తికరంగా మారింది.

ఏడాదైనా పూర్తికాని ధర్మారెడ్డిపల్లి రోడ్డు పనులు

- గుంతలమయంగా గజ్వేల్ , చేగుంట ప్రధాన రహదారి
- ప్రమాదాలు జరుగుతున్నా స్పందించని అధికారులు
- పనులు పూర్తి చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిక
- బీజేపీ మండల అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్



ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :గజ్వేల్, చేగుంట ప్రధాన రహదారిలో ధర్మారెడ్డిపల్లి గ్రామ సమీపంలో నిలిచిపోయిన రోడ్డు మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం భారీ ధర్నా నిర్వహించారు. గజ్వేల్ మండల అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్ నేతృత్వంలో చేపట్టిన ఈ ఆందోళనలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అధికారుల నిర్లక్ష్యంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి ఎలకంటి సురేష్, మండల అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్ మాట్లాడుతూ.. గజ్వేల్ నుంచి చేగుంటకు వెళ్లే ప్రధాన రహదారిలో ధర్మారెడ్డిపల్లి సమీపంలో రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి దాదాపు ఏడాది గడుస్తున్నా మరమ్మతు పనులు పూర్తికాకపోవడం విచారకరమన్నారు. ఈ మార్గంలో నిత్యం వందలాది మంది ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారని, రహదారి దెబ్బతినడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో పలుమార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, అయినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో ప్రయాణికుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతు పనులను పూర్తి చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే గ్రామస్తుల సహకారంతో బీజేపీ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వంజరి రాజు, ధాతర్‌పల్లి సర్పంచ్ దివ్య రాజు, మండల ప్రధాన కార్యదర్శులు ఇప్ప స్వామి, బారు అరవింద్, ఉపాధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, బీనమైన ప్రభాకర్, శాతం స్వామి, మండల కార్యదర్శి కూర స్వామి, కోశాధికారి పంజ బాలయ్య, సీనియర్ నాయకులు బోయిని సత్యం, రామస్వామి, వాచిని శివప్రసాద్, నగేష్, శ్రీరామ్ రాజు, బీజేవైఎం నాయకులు మహేష్ చారి, సాయికిరణ్, అనిల్, సంతోష్, చందు, మండల నాయకులు కర్నాల గణేష్, నరేష్ గౌడ్, కర్ణాకర్, మణికంఠ, రాజు, మల్లేశం, మహేందర్, చింటూ, మురళి తదితరులు పాల్గొన్నారు.

రూ.40 వేల లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిన ఎస్ఐ!

- రూ.50 వేలు డిమాండ్.. చివరకు రూ.40 వేలకు ఒప్పందం
- బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు
- రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని అదుపులోకి తీసుకున్న ఏసీబీ
- ట్రైనీ ఎస్ఐ గా గతములో మంచిర్యాల జిల్లాలో ఎస్ఐగా విధులు



.ప్రజా వాయిస్ బజార్‌హత్నూర్./ఆదిలాబాద్.ఆదిలాబాదు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల వలకు మరో అవినీతి పోలీస్ అధికారి చిక్కాడు. ఆదిలాబాద్ జిల్లాలోని బజార్‌హత్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రమేష్ ఓ కేసు విషయంలో బాధితుడిని రూ.50 వేల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. అంత మొత్తం చెల్లించలేనని బాధితుడు వేడుకోవడంతో చివరకు రూ.40 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది.ఎస్ఐ వేధింపులు భరించలేని బాధితుడు నేరుగా ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ డీఎస్పీ గిరి మధు ఆధ్వర్యంలో అధికారులు పక్కా ప్రణాళిక రూపొందించారు. ఈ క్రమంలో బాధితుడి నుంచి రూ.40 వేల లంచం తీసుకుంటుండగా ఎస్ఐ రమేష్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.అనంతరం ఎస్ఐను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు పోలీస్ స్టేషన్‌లో సోదాలు నిర్వహించి కేసు నమోదు చేశారు. ఈ ఘటనతో పోలీస్ శాఖలో కలకలం రేగింది. అవినీతికి పాల్పడే అధికారులపై ఏసీబీ నిఘా కొనసాగుతోందనే విషయం మరోసారి స్పష్టమైంది.

కథలాపూర్ నాయబ్ తహశీల్దార్‌గా స్వప్న బాధ్యతల స్వీకరణ



ప్రజా వాయిస్, కథలాపూర్:కథలాపూర్ మండల తహశీల్దార్ కార్యాలయంలో నూతన నాయబ్ తహశీల్దార్‌గా స్వప్న బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె మండల తహశీల్దార్ రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చాగంటి కోటేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసిన దాస్యం వినయ్ భాస్కర్

- **భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణలో చాగంటి ప్రవచనాలు ఆదర్శనీయం**

ప్రజా వాయిస్ / హనుమకొండ జిల్లా ప్రతినిధి: హనుమకొండ నగరానికి విచ్చేసిన ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, వేద పండితులు చాగంటి కోటేశ్వరరావును ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావుతో ఆధ్యాత్మిక, ధార్మిక అంశాలపై ఆత్మీయంగా ముచ్చటించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, సనాతన ధర్మం, ఆధ్యాత్మిక విలువలను తన అద్భుత ప్రవచనాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తూ సమాజానికి దిశానిర్దేశం చేస్తున్న చాగంటి సేవలను దాస్యం వినయ్ భాస్కర్ కొనియాడారు. నేటి సమాజంలో మానవీయ విలువలు, నైతికత, ధర్మబద్ధమైన జీవన విధానం పెంపొందించడంలో చాగంటి ప్రవచనాలు విశేషంగా దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని భావితరాలకు అందించడంలో ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని ఈ సందర్భంగా ప్రశంసించారు.



గుడుంబా రహిత బయ్యారమే మా లక్ష్యం

- **గుడుంబా తయారీ, విక్రయాలపై పోలీసుల ఉక్కుపాదం**
- **300 లీటర్ల బెల్లం పానకం, 12 లీటర్ల గుడుంబా ధ్వంసం**
- **ఐదుగురిపై కేసులు నమోదు.. అక్రమ విక్రయదారులపై ప్రత్యేక నిఘా**
- **చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు ఎస్ఐ ప్రశాంత్ బాబు**

ప్రజా వాయిస్, బయ్యారం:నిషేధిత నాటు సారా తయారీ, విక్రయాలపై పోలీసులు కొరడా ఝళిపించారు. నమ్మదగిన సమాచారం మేరకు రామచంద్రపురం పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన 300 లీటర్ల బెల్లం పానకం, 20 కిలోల నల్లబెల్లం, 5 కిలోల పట్టికతో పాటు 12 లీటర్ల గుడుంబాను గుర్తించి ధ్వంసం చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రశాంత్ బాబు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. గుడుంబా సేవించడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నప్పటికీ కొందరు అక్రమార్కులు నాటు సారా తయారీ, విక్రయాలకు పాల్పడటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందని తెలిపారు.గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తామని, నాటు సారా తయారీదారులు, విక్రయదారులపై కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే అక్రమ వ్యాపారాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం కల్పించబోమని స్పష్టం చేశారు.ఈ తనిఖీల్లో ఎస్ఐ ప్రశాంత్ బాబుతో పాటు హెడ్ కానిస్టేబుల్ పాపారావు, సారంగపాణి, మోహన్, రజిని తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు...



మందు తాగి డ్రైవింగ్ చేస్తే జైలుకే.!

- **డ్రంకెన్ డ్రైవ్ లో 8 మందికి జైలుశిక్ష.. మరో 14 మందికి జరిమానా**
- **22 మందికి కలిపి రూ.22,500 ఫైన్ విధించిన కోర్టు**
- **ఏడుగురికి ఒకరోజు.. మరొకరికి రెండు రోజుల జైలు**
- **నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు: ట్రాఫిక్ ఎస్ ఐ అంజిరెడ్డి**

ప్రజా వాయిస్, కోదాడ:మద్యం మత్తులో వాహనాలు నడిపితే జైలుపాలవడం ఖాయమని కోదాడ ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి హెచ్చరించారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 22 మందిని పోలీసులు బుధవారం కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, ప్రథమ శ్రేణి మేజిస్ట్రేట్ ఎం.డి. ఉమర్ ఎనిమిది మందికి జైలుశిక్ష విధించారు. వీరిలో ఏడుగురికి ఒకరోజు, మరొకరికి రెండు రోజుల జైలు శిక్ష ఖరారు చేశారు. మిగిలిన 14 మందికి జరిమానా విధించారు. మొత్తం 22 మందికి కలిపి రూ.22,500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ అంజిరెడ్డి మాట్లాడుతూ మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

హుజూర్ నగర్ మున్సిపాలిటీలో రూ.6 కోట్ల నిధుల భారీ అవినీతి ఆరోపణలు

- **నిధుల గోల్ మాల్ లెక్కలపై కలెక్టర్ విచారణ జరిపి శ్వేతపత్రం విడుదల చేయాలి**
- **షాడో కౌన్సిలర్లపై నిషేదానికి డిమాండ్**



!ప్రజా వాయిస్ | హుజూర్ నగర్ | నవంబర్ 04హుజూర్ నగర్ మున్సిపాలిటీలో రూ.6 కోట్ల నిధుల ఖర్చు వ్యవహారం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మున్సిపాలిటీకి చెందిన కోట్లాది రూపాయల ప్రజాధనం ఏమైంది? ఎక్కడ ఖర్చు చేశారు? అనే ప్రశ్నలకు సమాధానం లేకపోవడంతో స్థానిక కౌన్సిలర్లలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ఆర్టీఐతో బయటపడ్డ లెక్కలు

మాజీ కౌన్సిలర్ జక్కుల వీరయ్య సమాచార హక్కు చట్టం (RTI) కింద మున్సిపాలిటీ నిధుల వివరాలు కోరారు. దీనికి మున్సిపల్ కమిషనర్ లిఖితపూర్వకంగా స్పందిస్తూ కీలక విషయాన్ని వెల్లడించారు. మున్సిపాలిటీ జనరల్ ఫండ్ నుండి రూ.4 కోట్లు, క్యాపిటల్ ఫండ్ నుండి రూ.2 కోట్లు వెరసి మొత్తం రూ.6 కోట్లు ఖర్చు చేసినట్లు కమిషనర్ అధికారికంగా తెలిపారు.

అసలు వివాదం ఇక్కడే మొదలైంది

రూ.6 కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నారే తప్ప ఆ నిధులు ఎవరికి వెళ్లాయి? ఏ కాంట్రాక్టర్ కు, ఏ సంస్థకు చెల్లించారు? ఏ తేదీన ఏ చెక్కు నంబర్ ద్వారా చెల్లింపు జరిగింది? ఏ వార్డులో ఏ అభివృద్ధి పనులు చేశారు? అందుకు సంబంధించిన బిల్లులు, వర్క్ ఆర్డర్లు, మెజర్మెంట్ బుక్స్ ఎక్కడ? అనే కీలకమైన సమాచారాన్ని మాత్రం కమిషనర్ ఇవ్వలేదని కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. సమాచారాన్ని బుధవారం నాటికి కౌన్సిల్ ముందు ఉంచుతామని కమిషనర్ హామీ ఇచ్చి ఆ తర్వాత మాట తప్పారని, దీని వెనుక భారీ గోల్ మాల్ ఉందనే అనుమానాలు బలపడుతున్నాయని కౌన్సిలర్లు అంటున్నారు.

కౌన్సిలర్ల ప్రధాన డిమాండ్లు:

1.రూ.6 కోట్ల ఖర్చుపై జిల్లా కలెక్టర్ స్థాయిలో స్వతంత్ర విచారణ జరపాలి

2.ప్రతి రూపాయి ఖర్చుకు సంబంధించిన పూర్తి రికార్డులతో శ్వేతపత్రం విడుదల చేయాలి

3.నిధుల దుర్వినియోగం జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

షాడో కౌన్సిలర్లపై మరో పోరు

నిధుల వివాదం నడుస్తుండగానే మున్సిపాలిటీలో మరో వివాదం తెరపైకి వచ్చింది. 11వ వార్డు కౌన్సిలర్ పులిచింతల వెంకటరెడ్డి మున్సిపల్ కమిషనర్ కు ఓ సంచలన వినతిపత్రం అందజేశారు. ఎన్నికల్లో గెలిచిన మహిళా కౌన్సిలర్లను మున్సిపాలిటీకి రానివ్వకుండా వారి స్థానంలో వారి భర్తలు కుటుంబ సభ్యులు 'షాడో కౌన్సిలర్లు'గా చలామణి అవుతూ కౌన్సిల్ సమావేశాల్లో అధికారిక కార్యకలాపాల్లో పెత్తనం చెలాయిస్తున్నారని, ఇది 73, 74వ రాజ్యాంగ సవరణల స్ఫూర్తికి, మహిళా రిజర్వేషన్ల లక్ష్యానికి విరుద్ధమని ఆయన లేఖలో పేర్కొన్నారు. అనర్హులైన వ్యక్తులు అధికారిక సమావేశాల్లోకి రాకుండా తక్షణమే నిషేధం విధించాలని ఆయన కోరారు.

దారి మళ్లించే ఎత్తుగడా?

వెంకటరెడ్డి లేఖ ఇచ్చిన కొద్ది నిమిషాల్లోనే రాజకీయం హీటెక్కింది. ఈ షాడో కౌన్సిలర్ వివాదాన్ని తెరపైకి తెచ్చి రూ.6 కోట్ల అవినీతి ఆరోపణల నుండి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం జరుగుతోందని అధికార పక్ష కౌన్సిలర్లు ఎదురుదాడికి దిగారు. కౌన్సిల్ లో తీర్మానాలు చేసేటప్పుడు కౌన్సిలర్లు కాని వారు ఉంటే, వారిని లోపలికి అనుమతించిన చైర్మన్, కమిషనర్లదే బాధ్యత. దీనిపై వారే సమాధానం చెప్పాలి అని వారు నిలదీస్తున్నారు.

బహిరంగ చర్చకు సవాల్

తాము చేసిన ఆరోపణలపై ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా సమక్షంలో బహిరంగ చర్చకు సిద్ధమని కౌన్సిలర్లు సవాల్ విసిరారు. ఈ వ్యవహారంలో జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని తక్షణ విచారణకు ఆదేశించి, మున్సిపాలిటీలో పారదర్శక పాలనను నెలకొల్పాలని డిమాండ్ చేస్తున్నారు.

తెలంగాణ రాష్ట్ర హెల్త్ కమిషనర్ ఏం చేస్తున్నారు?

జిల్లా యంత్రాంగం పర్యవేక్షణ లోపంతోనే అనర్థాలు



ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి బంతిలో కూర్చున్నప్పుడు వడ్డించేవాడు మనవాడు అయితే ఏ మూలకు కూర్చున్న మాంసం ముక్కలు పడవ అన్న చందంగా అప్పటి ఉన్నత అధికారులది విశాలమైన హృదయం కావడంతో పనులు చకచకా అయిపోయాయి. మూడో వ్యక్తికి తెలియకుండా అధికారాన్ని అడ్డం పెట్టుకొని పైసలు ముట్ట చెప్పిన వారికి ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి దత్తత పేరుతో ఒకరికి ఉద్యోగం.?ఫోర్త్ క్లాసు ఉద్యోగాలు కాళీ ఉండడంతో ఉద్యోగాలు ఇస్తామని అందిన కాడికల్లా దోచుకుని దాచుకున్నారు. అనర్హులను సైతం అందలం ఎక్కిచ్చిన సంఘటనలు లేకపోలేదని పట్టణ ప్రజలు హాస్పటల్ సిబ్బంది ఒకరితో ఒకరు ముచ్చటించుకుంటున్నారు. గతంలో ఫార్మసిస్ట్ గా ఔట్సోర్సింగ్ పోస్ట్ కాళీ ఉండడంతో దరఖాస్తు పెట్టుకున్న మహిళ నుండి 1,50,000 వేల రూపాయలు తీసుకొని విధులు నిర్వహిస్తుంది ప్రభుత్వం ఆ పోస్టును భర్తీ చేయడంతో పైసలు తీసుకున్న అప్పటి అధికారికి సంబంధించిన నమ్మకస్తుడిపై గొడవకు దిగడంతో అప్పటి ఉన్నతాధికారి వర్ధన్నపేటకు పోస్టు కాళి ఉండడంతో అవుట్సోర్సింగ్ బదిలీ చేసినట్లు విశ్వనీయ సమాచారం గతంలో ఉన్నత అధికారులను మేనేజ్ చేసినట్లు ఇప్పటి ఉన్నతాధికారులు కూడా సహకరిస్తారని దీమ వ్యక్తం చేస్తున్నట్లు దత్తత పేరుతో వచ్చిన ఉద్యోగి అన్నట్లు సమాచారం. పరకాల పట్టణ కేంద్రంలోని ఆస్పత్రిలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలని. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన సంబంధిత జిల్లా అధికారులు.. విధుల్లో చేరి విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై విచారణ చేపట్టి అవినీతికి పాల్పడ్డ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్న నియోజకవర్గ ప్రజలు రోగులు.



రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలకు తావిస్తే చర్యలు తప్పవు

- **తరుగు పేరుతో కోత విధిస్తే సహించేది లేదు**
- **రేషన్ డీలర్లకు సర్పంచ్ బిల్లా యాదగిరి హెచ్చరిక**

ప్రజా వాయిస్ / హనుమకొండ జిల్లా ప్రతినిధి: వేలేరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని రేషన్ డీలర్ షాపులను స్థానిక సర్పంచ్ బిల్లా యాదగిరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలో నాలుగు రేషన్ షాపులు ఉండగా, వాటి ద్వారా 2,250 రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. బియ్యం పంపిణీలో తరుగు పేరుతో కార్డుదారులకు తక్కువ బియ్యం ఇవ్వడం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ప్రతి రేషన్ కార్డుదారుడికి ప్రభుత్వం నిర్దేశించిన పూర్తి పరిమాణంలో బియ్యం అందించాలని డీలర్లకు సూచించారు. రేషన్ షాపులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తూకాల్లో ఎలాంటి తేడాలు లేకుండా పారదర్శకంగా పంపిణీ చేపట్టాలని ఆదేశించారు. బియ్యం పంపిణీలో అవకతవకలు జరిగినా, కొలతల్లో తేడాలు ఉన్నట్లు ఫిర్యాదులు వచ్చినా సంబంధిత డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు ఎలాంటి కోతలు, అక్రమాలు లేకుండా అందేలా నిరంతరం పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ, వార్డు సభ్యులు లక్ష్మీనారాయణ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రళయాన్ని సృష్టించిన మురుసు తుఫాన్

- **వాగులు వంకలు పొంగి ఇళ్ల మధ్యకు చేరిన వరద!**
- **చిన్నపాటి సముద్రంలో తలపిస్తున్న గ్రామాలు!**
- **ప్రధాన కాల్వలు మరియు కుంటలు పూడ్చడంతో పెను ప్రమాదం!?**
- **పుట్టెడు దుఃఖాన్ని రైతన్నకు మిగిల్చిన వాన!**
- **ఇరిగేషన్ శాఖ స్పందిస్తేనే తప్ప రాబోయే ప్రణయాన్ని ఆపేది లేదంటున్న ప్రజలు**





ప్రజా వాయిస్ అశ్వారావుపేటనియోజకవర్గంలోని గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులో వంకలు ఏకమై ఇళ్ల మధ్యలోకి వరద నీరు చేరుకొని చిన్నపాటి సముద్రంలో గ్రామాలు తలపిస్తున్నాయి అంతేకాకుండా చిన్న పార్టీ చెరువులు ఆయకట్టలు తెగిపోవటంతో పంటసే పడి పుట్టుడు దుఃఖాన్ని రైతన్నకు మిగిల్చాయని చెప్పుకోవచ్చు దీనికి ప్రధాన కారణం నగరంలోని కొందరు పంట కాలువలను చెరువులను రియల్ ఎస్టేట్ చేసి పూడ్చి వేయడంతో నీటి ప్రవాహానికి దారి లేక గ్రామాల్లోకి పంటసీలు పై పడి సముద్రంలో తలపించేలా కనిపిస్తున్నాయి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం లోని దమ్మపేట ములకలపల్లి అన్నపరెడ్డిపల్లి చంద్రుగొండ అశ్వరావుపేట వంటి మండలాల్లోని ప్రధాన చెరువుల ఆయకట్ట తెగిపోయే పరిస్థితి ఏర్పడి చివరికి వరద ఉధృత కు తెగిపోతున్నట్లు కనిపిస్తున్న దృశ్యాలు రైతు కంట కన్నీళ్లు పెట్టిస్తుంది గత కొన్ని రోజుల క్రితం ములకలపల్లి పట్టణ సమీపంలోని ప్రధాన రహదారి లోని ఓ పంతెన భారీ వర్షాలతో కుంగిపోవటంతో ప్రత్యేక ప్యాకేజీ లో భాగంగా లక్షల రూపాయలు వ్యాయం చేసి తాత్కాలిక రహదారిని నిర్మిస్తే గత రెండు రోజులుగా కురుస్తున్న మురుసు తుఫాన్ వల్ల కొట్టుకుపోవడం కొంత ప్రయాణానికి ప్రయాణకులకు అంతరాయం కలిగించినట్లే అంతేకాకుండా అశ్వారావుపేట పట్టణంలోని దొంతుకుంట చెరువు అభివృద్ధి కోసం కోట్ల రూపాయల ఖర్చు చేసి మరమ్మత్తులు చేపడితే మురుసు తుఫాను తాకిడికి ఆయకట్ల సైతం తెగిపోయిన దృశ్యాలు దర్శనమిస్తున్నాయి అలాగే అశ్వారావుపేట నియోజకవర్గంలోని అతిపెద్ద ఆయకట్ట కలిగిన చెరువు గుమ్మడి వెల్లి చెరువు ఇటువంటి చెరువుకి కోట్ల రూపాయల వ్యాయామంతో తాత్కాలికంగా రిగ్గు బండ నిర్మాణం చేపట్టడం జరిగింది. అటువంటి ఆనకట్ట తుఫాన్ తాకిడికి కొట్టుకుపోయిన దృశ్యాలు అందర్నీ ఆశ్చర్యకరవేసింది లక్షల ఖర్చు చేసి అది కొద్దికాలం అయినప్పటికీ రెండు రోజుల తుఫాన్లకు భారీ బడ్జెట్ కలిగిన ఆయకట్ల తెగిపోవటం ఎలా అని ఇటువంటి విధానాన్ని అమలు చేసిన అధికారులు దా లేక ఆదేశాలు జారీచేసిన ప్రజాప్రతినిధులుగా అంటూ ప్రజానీకం తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కరీంనగర్ కార్పొరేషన్ అవినీతిపై చర్యలేవీ..?

- బండి సంజయ్ పై కాంగ్రెస్ కార్పొరేటర్ అంజన్ కుమార్ ఫైర్
- అవినీతిని బయట పెట్టకుండా ప్రగల్భాలు పేలడం ఏంటి.?
- కేంద్రం నుండి తీసుకొచ్చిన నిధుల వివరాలు ప్రజలకు చేప్పాలి
- కరీంనగర్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారు

ప్రజా వాయిస్, కరీంనగర్(నవంబర్ 04): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతి జరుగుతోందని స్వయంగా కార్పొరేటర్ల సమావేశంలో కేంద్ర మంత్రి, ఎంపీ బండి సంజయ్ వ్యాఖ్యానించడంపై కాంగ్రెస్ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతిపై కేవలం హెచ్చరికలు చేయడం కాకుండా బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. కరీంనగర్ అభివృద్ధికి కేంద్రం నుంచి నిధుల వరద తీసుకొస్తామని చెప్పిన బండి సంజయ్ ఇప్పటి వరకు తీసుకొచ్చిన నిధుల వివరాలను ప్రజలకు వెల్లడించాలని ప్రశ్నించారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులకు యు.డి.ఐ.ఎఫ్ నిధులు ప్రధాన ఆధారమని అందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా కూడా గణనీయంగా ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కరీంనగర్ అభివృద్ధిపై సానుకూలంగా ఉన్నారని తెలిపారు. గత పాలకవర్గం హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినీతిపై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. గతంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌లో ప్రస్తుత పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వానికి కూడా వినతిపత్రం అందజేస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు మల్లికార్జున రాజేందర్, గంట శ్రీనివాస్, కాంతల జగన్ రెడ్డి, చారకొండ బుచ్చిరెడ్డి, పడిశెట్టి భూమయ్య, కల్లపల్లి బాలరాజు, సరిల్ల ప్రసాద్, కంకణాల అనిల్, ఇమ్రాన్, సత్తం శ్రీకాంత్, పహాడ్ పెంట శేఖర్, శ్రీకాంత్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నార్సింగి సర్కారు దవాఖానాలకు సుస్తీ

- పట్టించుకునే నాథుడేడి.?
- సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న ఆరోగ్య కేంద్రాలు
- పేదల వైద్యానికి భరోసా లేదు..?
- సర్కారు ఆసుపత్రుల్లో సౌకర్యాలు లేవు.?
- విరిగిపోయిన పడకలు.. బూజు పట్టిన గదులు
- అపరిశుభ్రత తాండవం
- ఆసుపత్రి ప్రాంగణంలో అడ్డగోలుగా మున్సిపల్, ప్రైవేట్ వాహనాల పార్కింగ్
- అధికారుల తీరుపై మాజీ కౌన్సిలర్ కోటిగారి ఉషారాణి నిప్పులు




కంపుకొడుతున్న మరుగు దొడ్లు


విరిగిన పడక

ప్రజావాయిస్‌‌ రాజేంద్రనగర్:పేదలకు నాణ్యమైన వైద్యం అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రులే సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. నార్సింగిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ), గ్రామీణ ఆరోగ్య కేంద్రం (ఆర్‌హెచ్‌సీ)ల పరిస్థితి చూస్తుంటే ప్రభుత్వ వైద్యసేవల నిర్వహణపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రోగులకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన ఆసుపత్రుల్లో విరిగిపోయిన పడకలు, బూజు పట్టిన గదులు, చుట్టూ పిచ్చి మొక్కలు, కంపు కొడుతూ,అపరిశుభ్ర వాతావరణంలో దర్శనమిస్తున్నాయి. ఆసుపత్రి ప్రాంగణం సైతం మున్సిపల్,ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారడం నిర్వహణ తీరుకు అద్దం పడుతోంది.ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేని నిరుపేదలకు ప్రభుత్వ దవాఖానాలే పెద్ద దిక్కు,అలాంటి ఆసుపత్రుల్లోనే కనీస వసతులు కరువైతే పేదలు తమ ఆరోగ్య సమస్యలను ఎవరికి చెప్పుకోవాలి..? రోగులకు వైద్యసేవలు అందించాల్సిన కేంద్రాలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారుతుంటే సంబంధిత అధికారులు ఏం చేస్తున్నట్లు..? ఆసుపత్రుల నిర్వహణపై పర్యవేక్షణ లేదా..? అన్న ప్రశ్నలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి.ఈ దుస్థితిపై మాజీ కౌన్సిలర్ కోటిగారి ఉషారాణి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రుల్లో నెలకొన్న అపరిశుభ్రత,విరిగిపోయిన పడకలు,అరకొర సౌకర్యాలను పరిశీలిస్తూ అధికారుల తీరును నిలదీశారు.గతంలో మంచి పేరుగాంచిన నార్సింగి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు నేడు కనీస సౌకర్యాలు లేక శిథిలావస్థకు చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఒకప్పుడు మెరుగైన వైద్యసేవలకు గుర్తింపు పొందిన ఈ కేంద్రాలు ప్రస్తుతం విరిగిపోయిన పడకలు, అపరిశుభ్ర గదులు, నిర్వహణ లోపాలతో అధ్వానంగా మారాయని మండిపడ్డారు.ఆసుపత్రుల అభివృద్ధి,నిర్వహణపై అధికారులు ఎందుకు దృష్టి సారించడం లేదని ప్రశ్నించారు.ప్రజలకు వైద్యసేవలు అందించాల్సిన బాధ్యతను విస్మరిస్తే ఎలా..? పేద ప్రజల ఆరోగ్యం పట్ల ఇంత నిర్లక్ష్యమా..? అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి ప్రాంగణంలో మున్సిపల్,ప్రైవేట్ వాహనాలను అడ్డగోలుగా నిలిపివేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తక్షణమే సమస్యలను పరిష్కరించి రోగులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రజలకు వైద్య భరోసా కల్పించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రులే ఇలా అధ్వానంగా ఉంటే పేదల పరిస్థితి ఏమిటి..? ప్రభుత్వ నిధులతో నడుస్తున్న ఆరోగ్య కేంద్రాల్లో పారిశుధ్యం,పడకలు, మౌలిక సదుపాయాలు కల్పించడం కూడా అధికారులకు భారమైందా..? ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నార్సింగి పీహెచ్‌సీ,ఆర్‌హెచ్‌సీల దుస్థితిని చక్కదిద్దాలి. పేదల వైద్యానికి భరోసా కల్పించాల్సిన సర్కారు దవాఖానాలే వారి పాలిట సమస్యల కేంద్రాలుగా మారకుండా తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రక్షించేందుకు వెళ్లి.. వరదలో గల్లంతు.!

- బేతుపల్లి చెరువులో 10 మంది ఎస్ డీఆర్ ఎఫ్ సిబ్బంది ఆచూకీ గల్లంతు
- మత్స్యకారుల ప్రాణాలు కాపాడే క్రమంలో పెను ప్రమాదం
- ఏడుగురిలో నలుగురిని రక్షించి.. మిగతా ముగ్గురి కోసం వెళ్లి మృత్యువుతో పోరాటం
- రెండు పడవల్లో వెళ్లిన రెస్క్యూ బృందం వరద ఉద్ధృతిలో చిక్కుకున్న వైనం
- పెరుగుతున్న వరద ప్రవాహంతో అధికారుల్లో తీవ్ర ఆందోళన

ప్రజా వాయిస్,ఖమ్మం: ఆపదలో ఉన్న మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లిన ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందే వరద ఉద్ధృతిలో చిక్కుకుని గల్లంతయ్యారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువులో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. చెరువు వరద నీటిలో ఏడుగురు మత్స్యకారులు చిక్కుకున్నట్లు సమాచారం అందడంతో వారిని కాపాడేందుకు ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది రెండు పడవల్లో రంగంలోకి దిగారు. తొలుత నలుగురు మత్స్యకారులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. మిగిలిన ముగ్గురిని రక్షించేందుకు ముందుకు వెళ్లిన సమయంలో వరద ప్రవాహం ఒక్కసారిగా ఉద్ధృతమైంది. దీంతో రెండు పడవల్లో ఉన్న 10 మంది ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది గల్లంతైనట్లు సమాచారం. వరద ఉద్ధృతి అంతకంతకూ పెరుగుతుండటంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. సిబ్బంది ఆచూకీపై అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.







బీఆర్ఎస్ ఆరోపణలకు కాంగ్రెస్ కౌంటర్ ఎటాక్

- భారీ ర్యాలీతో సవాల్
- ఇందిరమ్మ ఇళ్ల నుంచి అభివృద్ధి పనుల వరకు లెక్కలతో సమాధానం
- మాజీ పాలకుల అవినీతిపై మున్సిపల్ పాలకవర్గం తీవ్ర ఆరోపణలు

ప్రజా వాయిస్ | హాలియా. బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తూ హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం హాలియాలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించడంతో పాటు గత బీఆర్ఎస్ పాలనపై పాలకవర్గం తీవ్ర విమర్శలు గుప్పించింది. హాలియా మున్సిపాలిటీలోని 12 వార్డులకు 365 ఇందిరమ్మ ఇళ్ల మంజూరయ్యాయని, నాలుగో వార్డుకు అత్యధికంగా 50 ఇళ్లు, జంగాల కాలనీకి 25 ఇళ్ల కేటాయించామని, ఇందులో గుడిసెల్లో నివసించే నిరుపేదలకు 16 ఇళ్లు అందించామని వెల్లడించింది. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఎలాంటి అవినీతి, లంచాలకు తావులేకుండా అర్హులకే కేటాయింపులు జరిపామని స్పష్టం చేసింది. మున్సిపాలిటీలో 26 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల్లో ఒక్కొక్కరి నుంచి రూ.3 లక్షల చొప్పున మొత్తం రూ.75 లక్షలు వసూలు చేశారంటూ బీఆర్ఎస్ నాయకులపై సంచలన ఆరోపణలు చేసింది. మరోవైపు హాలియాను సోలార్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు రూ.6.32 కోట్లతో మూడు వార్డుల్లోని 465 ఇళ్లకు ఉచిత సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపింది. ఎమ్మెల్యే నగర అభివృద్ధి పథకం కింద రూ.15 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ పనులు, అమృత్ పథకం ద్వారా మరో రూ.15 కోట్లతో తాగునీటి వసతులు కల్పిస్తున్నామని వివరించింది. ప్రభుత్వ ఆసుపత్రి ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటున్నామని, ఎన్ఎస్పీ కాలువకు మంజూరైన నిధుల వ్యవహారంలోనూ గత పాలకుల తీరుపై ప్రశ్నలు లేవనెత్తింది. నాలుగో వార్డులో విద్యుత్ స్తంభాలు, పైపులైన్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టినట్లు పేర్కొంది. బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలని, హాలియా అభివృద్ధిపై వాస్తవాలు ప్రజల ముందు ఉంచాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్లు నారాయణ గౌడ్, తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అమానుషం

- మతం పేరుతో దాడులు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదు
- దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



జవాయిస్/వికారాబాద్ బ్యూరో:హైదరాబాద్‌లోని బాలాపూర్ పరిసర ప్రాంతంలో మహిళలపై జరిగిన దాడి ఘటనను వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తీవ్రంగా ఖండించారు.బుధవారం ఆయన ప్రకటనలో మాట్లాడుతూ...మతం పేరుతో మహిళలపై దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే పోలీసులను ఆశ్రయించి చట్టపరంగా పరిష్కరించుకోవాలే తప్ప, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని మహిళలపై దాడులు చేయడం సమర్థనీయం కాదన్నారు.ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం తక్షణమే స్పందించి బాధిత మహిళలకు రక్షణ కల్పించాలని, దాడికి పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో మత సామరస్యం, శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి!

- కేజీబీవీలో పోలీసుల అవగాహన కార్యక్రమం

ప్రజా వాయిస్/మోమిన్‌పేట్ వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బుధవారం మోమిన్‌పేట్ పోలీసులు, వికారాబాద్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణా, మహిళల భద్రత, బాలల హక్కులు, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తత వంటి అంశాలపై వివరించారు. ఏదైనా ఆపద ఎదురైతే వెంటనే పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జమీందారు వెంకటయ్య, పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



హోంవర్క్ చేయలేదని టీచర్ మందలింపు.. బాలుడి బలవన్మరణం.!

- ఉపాధ్యాయుడి దండనతో మనస్తాపం?
- తండ్రికి ఫోన్ చేసి హాస్టల్లో ఉండలేనన్న విద్యార్థి
- వసతి గృహంలో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య
- గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన సిబ్బంది

ప్రజా వాయిస్,సిద్దిపేట జిల్లా/ వర్గల్: హోంవర్క్ చేయలేదని ఉపాధ్యాయుడు కొట్టడంతో మనస్తాపానికి గురైన పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన సిద్దిపేట జిల్లాలో చోటుచేసుకుంది. వర్గల్ మండల కేంద్రంలోని బీసీ వసతి గృహంలో ఉంటూ పదో తరగతి చదువుతున్న మార్కుక్ మండలం పోతూర్ గ్రామానికి చెందిన రామ్ చరణ్ (15) ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు.స్కూల్లో టీచర్ కొట్టాడని, హాస్టల్లో ఉండలేకపోతున్నానని రామ్ చరణ్ తన తండ్రికి ఫోన్ చేసి చెప్పినట్లు సమాచారం. ఈ క్రమంలో హాస్టల్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన సిబ్బంది బాలుడిని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో విద్యార్థి కుటుంబంలో విషాదం నెలకొంది. ఉపాధ్యాయుడి మందలింపే బాలుడి ఆత్మహత్యకు కారణమా అనే కోణంలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్

ప్రతినిధి



మాటేగాం గ్రామంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.బుధవారం భైంసా మండలం మాటేగాం గ్రామంలో కలెక్టర్ పర్యటించి, డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఇళ్లకు సంబంధించిన రికార్డులు, లబ్ధిదారుల వివరాలను పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులను గుర్తించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.అనంతరం భైంసా పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. స్థల విస్తీర్ణం, ఇతర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి, తదుపరి చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, తహసీల్దార్ శశిభూషణ్, ఎంపీడీవో నీరజ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ రక్షణ సేనలోకి భారీగా చేరికలు

మాజీ కార్మిక శాఖ మంత్రి బోడ జనార్దన్ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరణ

ప్రజా వాయిస్.కన్నెపల్లి

బెల్లంపల్లి నియోజకవర్గం లోని కన్నేపల్లి మండలములో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. బెల్లంపల్లి నియోజకవర్గంలోని కన్నెపల్లి మండలం చింతపూడి, లింగాల గ్రామాల్లో మాజీ కార్మిక శాఖ మంత్రి బోడ జనార్దన్ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన సుమారు 300 మంది ప్రజలు తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. వారికి బోడ జనార్దన్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా బోడ జనార్దన్ మాట్లాడుతూ.. ప్రజలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించడంతో పాటు సత్వర న్యాయం కల్పించడం, రైతులకు గిట్టుబాటు ధరలు అందించడం, రైతులను రాజులుగా చేయడమే తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కవితక్క ప్రధాన లక్ష్యమని వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పార్టీ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.కన్నెపల్లి మండలంలోని లింగాల గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. లింగాల గ్రామం నుంచి వేమనపల్లి, కన్నెపల్లి మండల



కేంద్రాలకు సరైన రోడ్డు రవాణా సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా చేరుకోలేని దుస్థితి నెలకొందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా విద్యుత్ సమస్యల కారణంగా పంట పొలాలు ఎండిపోతున్నా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. మెట్టుపల్లి, ఏసయ్యపల్లి తదితర పరిసర గ్రామాల రైతులకు పీపీరావు ప్రాజెక్టు కాలువలో పూడిక తొలగించకపోవడంతో సాగునీరు అందడం లేదని పేర్కొన్నారు. కాలువల పూడికతీత పనులు చేపట్టకపోవడంతో ఎంతోమంది రైతులు సాగుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని బోడ జనార్దన్ దుయ్యబట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, రవాణా, విద్యుత్, సాగునీటి సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం కొనసాగుతోందని విమర్శించారు. ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రక్షణ సేన నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో చింతపూడి, లింగాల గ్రామాలతో పాటు పరిసర గ్రామాలకు చెందిన సుమారు 300 మంది ప్రజలు తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరడం పట్ల పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ దుర్గం భానేష్, కన్నెపల్లి మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నాగయ్య, వేమనపల్లి మండల అధ్యక్షుడు సాయి కిరణ్, తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



షేరుపల్లిలో పశువుల ఆరోగ్య, సంతానోత్పత్తి వైద్య శిబిరం

వి బి జి రంజి పథకంపై రైతులకు అవగాహన కార్యక్రమం

మండల పశువుల వైద్య అధికారి మాధవి

శ్రీరంగాపూర్ నవంబర్ 4 ప్రజా వాయిస్

మండల పరిధిలోని షేరుపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ గురువారం ఉదయం 7:30 గంటలకు పశువుల ఆరోగ్య మరియు సంతానోత్పత్తి వైద్య శిబిరం నిర్వహించనున్నారనీ మండల అధికారి మాధవి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ శిబిరంలో ఆవులు, గేదెలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు వ్యాధుల నిర్ధారణ, అవసరమైన చికిత్సలు, నట్టల నివారణ, సంతానోత్పత్తి సమస్యల గుర్తింపు తదితర వైద్య సేవలను అందించనున్నారు. అలాగే పశువుల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి రైతులకు పశువైద్యులు తగిన సూచనలు, సలహాలు అందజేయనున్నారు.అదేవిధంగా వి బి జి రంజి పథకంపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పశుసంపద అభివృద్ధి, పశువులకు అవసరమైన పశుగ్రాసం లభ్యత పెంపు, పశుపోషకుల జీవనోపాధి మెరుగుదల వంటి అంశాలను వివరించనున్నారు.కావున షేరుపల్లి గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల రైతులు, పశుపోషకులు తమ ఆవులు, గేదెలను ఈ వైద్య శిబిరానికి తీసుకువచ్చి ఉచిత పశువైద్య సేవలను, ప్రభుత్వ పథకాలపై అవగాహనను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులు కోరారు.



కరువు రైతులకు రుణ ఉపశమనం కల్పించాలి

- 12 నెలల మారటోరియం.. 36 నెలల వరకు రుణ గడువు పొడిగింపు

- రుణ చెల్లింపుల కోసం రైతులపై ఒత్తిడి చేయొద్దు...కలెక్టర్

ప్రజా వాయిస్, భూపాలపల్లి

జిల్లాలో కరువు ప్రభావిత మండలాల రైతులకు పంట రుణాల పునర్వ్యవస్థీకరణ ద్వారా ఉపశమనం కల్పించాలని కలెక్టర్ రాహుల్ శర్మ బ్యాంకు అధికారులను ఆదేశించారు. రైతులకు 12 నెలల మారటోరియం కల్పించడంతో పాటు రుణ చెల్లింపు గడువును 36 నెలల వరకు పొడిగించాలని సూచించారు. రుణాల వసూళ్ల కోసం రైతులపై ఒత్తిడి చేయవద్దని స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాంకు సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కాటారం, మహాముత్తారం, మహాదేవపూర్, మల్హర్‌రావు, గోరికొత్తపల్లి మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించినట్లు తెలిపారు. గత సీజన్‌లో జిల్లాలో 1.05 లక్షల ఎకరాలకు పైగా వరి సాగు కాగా, ప్రస్తుత సీజన్‌లో నీటి లభ్యత దృష్ట్యా 38 వేల ఎకరాలకే వరి సాగును పరిమితం చేసేలా ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ వెల్లడించారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని కోరారు. సమావేశంలో ఎల్‌డీఎం నాగరాజు, ఆర్‌బీఐ, నాబార్డ్ అధికారులు, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

ములుగులో పన్నుల మోత...అభివృద్ధి మాత్రం శూన్యం.!

ఎనిమిది రెట్లు ఇంటి పన్నుల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలి

నవంబర్ 11లోగా పన్నులు తగ్గించాలి... లేకుంటే 12న మున్సిపాలిటీ ఎదుట నిరాహార దీక్ష

సిరికొండ బలరాం బిజెపి జిల్లా అధ్యక్షుడు

ప్రజా వాయిస్ ములుగు జిల్లా:/

ములుగు మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నులను ఎనిమిది రెట్లు పెంచడం ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపడమేనని బీజేపీ ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో మున్సిపాలిటీ ఏర్పాటు చేసి, కనీస సదుపాయాలు కల్పించకుండా ప్రజల జేబులకు చిల్లులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ములుగు జిల్లా బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బలరాం మాట్లాడుతూ... గిరిజన, వెనుకబడిన ప్రాంతమైన ములుగు పట్టణ అభివృద్ధిపై పాలకులు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా ప్రజలపై భారీగా పన్నులు విధించడం దుర్మార్గమన్నారు.

అభివృద్ధి ఎక్కడ? ప్రజలకు కనీస సౌకర్యాలు ఏవి?

మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు అనక ప్రాంతాల్లో రహదారులు, మురుగునీటి కాలువలు, వీధి



దీపాలు, తాగునీటి సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని విమర్శించారు. కనీస సౌకర్యాలు కల్పించకుండా పన్నులు పెంచడం పాలకుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. ములుగులో వ్యాపారాలు అంతంతమాత్రంగానే సాగుతున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో వాణిజ్య, వ్యాపార గృహాలపై భారీగా పన్నులు విధిస్తే చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యాపారులపై మరింత భారం మోపడం తగదని స్పష్టం చేశారు.

ప్రజలను బెదిరించడం కాదు...

సమస్యలకు పరిష్కారం చూపాలి!

పన్నుల పెంపుపై ప్రజలు ప్రశ్నించినప్పుడు మున్సిపల్ కమిషనర్ బెదిరింపు ధోరణితో వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని బలరాం అన్నారు. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల హక్కుల కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

నవంబర్ 12న మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష!

పెంచిన ఇంటి పన్నులను నవంబర్ 11వ తేదీలోగా తగ్గించాలని బీజేపీ డిమాండ్ చేస్తోందని తెలిపారు. అప్పటివరకు పెంచిన పన్నులు చెల్లించవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. అధికారులు స్పందించి పన్నులు తగ్గించకపోతే నవంబర్ 12న ములుగు పట్టణ శాఖ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ప్రజల మద్దతుతో పెద్ద ఎత్తున నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ప్రజలపై పన్నుల భారం తగ్గించి, ములుగు పట్టణానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే వరకు బీజేపీ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని బలరాం స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీలమంతుల రవీంద్రచారి, జిల్లా ఉపాధ్యక్షుడు అల్లె శోభన్, జిల్లా కోశాధికారి గంగిశెట్టి రాజకుమార్, సీనియర్ నాయకుడు ఎల్కతుర్తి శ్రీహరి, ములుగు మండల అధ్యక్షుడు రాయంచు నాగరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శులు బోగిరి రాకేష్, అజ్మీర కిషోర్, యువమోర్చా పట్టణ అధ్యక్షుడు లౌడియా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలన్నింటికీ రుణాలు మంజూరు చేయాలి

- సరస్వతి ఎస్ఎల్ఎఫ్ గ్రూపులపై పర్యవేక్షణ కరువు

- రెండేళ్లుగా పట్టించుకునే వారు లేరని సభ్యుల ఆవేదన

- మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సంతబోయిన ఎల్లయ్య

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :

గజ్వేల్ పట్టణంలోని సరస్వతి ఎస్ఎల్ఎఫ్ పరిధిలో ఉన్న డ్వాక్రా సంఘాల సభ్యులందరికీ రుణాలు మంజూరు చేయడంతోపాటు గ్రూపుల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సంతబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం సీపీఎం నాయకులు, డ్వాక్రా సంఘాల సభ్యులతో కలిసి గజ్వేల్ మున్సిపల్ కమిషనర్



గణేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంతబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ.. సరస్వతి ఎస్-ఎల్ఎఫ్ పరిధిలో గతంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపి ఆర్‌పీ, సీఓలను తొలగించడంతోపాటు కేసులు నమోదు చేశారని తెలిపారు. అయితే ఆ తర్వాత గత రెండేళ్లుగా ఈ పరిధిలోని డ్వాక్రా సంఘాలను పట్టించుకునే వారు లేకుండా పోయారని, సభ్యులకు రుణాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రూపుల నిర్వహణ, పర్యవేక్షణ కూడా సక్రమంగా జరగడం లేదన్నారు. సమస్య పరిష్కారం కోసం పలుమార్లు గ్రూపు సభ్యులు సీఓను సంప్రదించినప్పటికీ, ఆర్‌పీ అందుబాటులో లేరని సమాధానం చెబుతున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంటనే జోక్యం చేసుకొని డ్వాక్రా సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేయాలని, గ్రూపులు సక్రమంగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులైన సభ్యులందరికీ రుణాలు మంజూరు చేయడంతోపాటు సంఘాల పనితీరును పర్యవేక్షించే బాధ్యతను సంబంధిత అధికారులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రంగారెడ్డి, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చెంగిచెర్లలో రోడ్డుపైనే కంటైనర్..!

వాహనదారులకు తప్పని తిప్పలు..

రహదారిని ఆక్రమించి వ్యాపార కార్యకలాపాలా?

రోడ్డు స్థలాన్ని వినియోగిస్తున్నారంటూ స్థానికుల ఆరోపణలు

అధికారులు పట్టించుకోవడం లేదంటూ ప్రజల ఆవేదన

డిప్యూటీ కమిషనర్ శైలజ స్పందించి ఆక్రమణలు తొలగించాలని విజ్ఞప్తి

మేడ్చల్ జిల్లా, మేడిపల్లి / ప్రజా వాయిస్ :

చెంగిచెర్లలో రహదారి ఆక్రమణల సమస్య రోజురోజుకూ పెరుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి పక్కనే కంటైనర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ఫుడ్ కోర్టు, ఇతర దుకాణాల పేరుతో రహదారి స్థలాన్ని వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అటుగా రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కంటైనర్ ఏర్పాటు, రోడ్డు పక్కన వాహనాల పార్కింగ్, ఇతర ఆక్రమణల



కారణంగా రహదారిపై రాకపోకలకు అంతరాయం కలుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ప్రజల సౌకర్యార్థం ఉండాల్సిన రహదారి స్థలాన్ని వ్యాపార అవసరాలకు వినియోగిస్తుంటే సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

డిప్యూటీ కమిషనర్ శైలజ స్పందించాలి!

ఈ సమస్యపై బోడుప్పల్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ శైలజ తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, రహదారి స్థలంలో అనుమతులు లేకుండా కంటైనర్లు, దుకాణాలు ఏర్పాటు చేసినట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రహదారి ఆక్రమణలను తొలగించి వాహనదారులకు, పాదచారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే సహించేది లేదు!

ఉద్యోగానికి ఎగనామం.. 2.5 ఏళ్లుగా 'టీచర్' గైర్హాజరు!అధికారులు నిద్రమత్తు వీడకపోతే డిఇఓ ఆఫీస్‌ను ముట్టడిస్తాం: SFI, AIPSU హెచ్చరిక

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

ప్రభుత్వ ఉద్యోగం అంటే బాధ్యత మరచి ప్రవర్తించడం కాదని, విధులను నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకునే ఉద్యోగులకు తగిన బుద్ధి చెబుతామని ఖాళీ× మరియు ూూూఖ విద్యార్థి సంఘాలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాయి. ముధోల్ మండలం వెంకటాపూర్ గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుని సుదీర్ఘ గైర్హాజరుపై విచారణ జరిపి తక్షణమే చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రత్యామ్నాయ ఉపాధ్యాయుడిని కేటాయించాలని డిమాండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి (ణజూూ) గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఖాళీ× నిర్మల్ జిల్లా కార్యదర్శి దిగంబర్ మరియు ూూూఖ నిర్మల్ జిల్లా కార్యదర్శి గడపాలి పరమేష్ సంయుక్తంగా మాట్లాడుతూ... వెంకటాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా, ఒక ఉపాధ్యాయుడు గత రెండున్నర సంవత్సరాలుగా (2.5 ఏళ్లు) విధులకు హాజరుకాకుండా బాధ్యతారాహిత్యంగా సుదీర్ఘ లీవ్‌లో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించకుండా, బాధ్యత



మరచి విధులను నిర్లక్ష్యం చేస్తున్న ఇలాంటి ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. స్థానిక మండల విద్యాశాఖ అధికారి (వీజూూ)ని వివరణ కోరగా, "టీచర్‌కు జీతం రావడం లేదు, ఆయన లీవ్‌లో ఉన్నాడు" అని బాధ్యతారాహిత్యంగా సమాధానం చెప్పడంపై మండిపడ్డారు. జీతం రాకపోవడం సమస్య కాదని, రెండేళ్లకు పైగా విద్యార్థులకు బోధన అందకుండా పోవడం అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

మూ డిమాండ్లు:

1 , కఠిన చర్యలు: గత 2.5 ఏళ్లుగా విధులకు రాకుండా గైర్హాజరవుతున్న ఉపాధ్యాయునిపై తక్షణమే శాఖాపరమైన విచారణ జరిపి ఉద్యోగం నుండి రద్దు/సస్పెన్షన్ చర్యలు తీసుకోవాలి.

2 , వెంటనే టీచర్ కేటాయింపు: వెంకటాపూర్ పాఠశాలకు వెంటనే మరొక ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై కేటాయించి విద్యాబోధనను పునరుద్ధరించాలి.

ఉన్నతాధికారులు స్పందించకుండా నిర్లక్ష్యం వహిస్తే, విధులకు గైర్హాజరవుతున్న సదరు టీచర్‌తో పాటు సంబంధిత అధికారుల తీరుకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మైలారం పాఠశాలలో అల్పాహార పథకం ప్రారంభం!

నిరుపేద విద్యార్థులకు ఎంతగానో తోడ్పడుతుందన్న గ్రామ సర్పంచ్ చిర్ర వేణు

రాయపర్తి మండలం మైలారం లో ఘనంగా ప్రారంభమైన రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపు

రాయపర్తి /ప్రజా వాయిస్



వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని మైలారం గ్రామ హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత 'అల్పాహార పథకం' ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మైలారం గ్రామ సర్పంచి చిర్ర వేణు విచ్చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఉదయాన్నే ఖాళీ కడుపుతో పాఠశాలలకు హాజరవుతున్న ఎంతోమంది నిరుపేద విద్యార్థులకు ఈ అల్పాహార పథకం ఎంతగానో తోడ్పడుతుందని, వారి ఆరోగ్యానికి మరియు విద్యాభివృద్ధికి దోహదపడుతుందని తెలియజేశారు. విద్యార్థులందరూ ప్రభుత్వం కల్పిస్తున్న ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, చక్కగా చదువుకొని భవిష్యత్తులో గొప్ప పదవులను చేపట్టాలని ఆకాంక్షించారు.

పాల్గొన్న ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు:

ఈ కార్యక్రమంలో పాఠశాల ఏఏపీసీ సభ్యురాలు నీరజ తో పాటు హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు (నవీ) అజ్మీరా ఉమాదేవి, ఏఏపీసీ సభ్యురాలు ఉల్లెంగల భాగ్యమ్మ పాల్గొన్నారు. అలాగే ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సింగరపు శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు డోలి రాజశ్రీ, విద్యా కమిటీ ప్రతినిధులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

నైపుణ్య శిక్షణతో విద్యార్థులకు విస్తృత ఉద్యోగ అవకాశాలు

మూడు సంవత్సరాల పాటు వివిధ శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం

విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. కె. మల్లేశం

ప్రజా వాయిస్ ములుగు జిల్లా:/

తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ కేంద్రం ద్వారా విద్యార్థులకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు పొందేందుకు అవసరమైన మార్గదర్శకత్వం లభిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. కె. మల్లేశం తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ములుగులో కళాశాల నైపుణ్య శిక్షణ కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్. కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థుల అవగాహన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రైవేటు, కార్పొరేట్ రంగాల్లో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలంటే విద్యార్థులు విద్యార్హతలతో పాటు సంభాషణ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఇందుకు కళాశాలలో నైపుణ్య శిక్షణ కేంద్రం ద్వారా అవసరమైన తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు.

సంభాషణ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక శిక్షణ - ఎం. రామకృష్ణ



ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన ప్రాంతీయ సమన్వయకర్త ఎం. రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల కోసం నిర్వహించే వివిధ శిక్షణ కార్యక్రమాలను వివరించారు. సంభాషణ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, మాట్లాడే సామర్థ్యం, గణిత నైపుణ్యాలు, తార్కిక ఆలోచనా విధానంపై ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో శిక్షణ పొందిన మార్గదర్శకుల ద్వారా విద్యార్థులకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఒకసారి నమోదు చేసుకుంటే మూడు సంవత్సరాల పాటు నిర్వహించే వివిధ శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని వివరించారు.

శిక్షణతో పాటు ఉద్యోగ మేళాల్లో అవకాశాలు - డాక్టర్ ఎస్. కవిత

కళాశాల నైపుణ్య శిక్షణ కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్. కవిత మాట్లాడుతూ గతంలో ఈ కేంద్రం ద్వారా శిక్షణ పొందిన పలువురు విద్యార్థులు వివిధ ఉద్యోగ మేళాల్లో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. నమోదు రుసుముగా ఓసీ, బీసీ విద్యార్థులు రూ.708, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.354 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. నమోదు చేసుకున్న విద్యార్థులకు కేంద్రం నిర్వహించే ఉద్యోగ మేళాల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ఉద్యోగ సాధనకు అవసరమైన నైపుణ్యాలు, అనుసరించాల్సిన వ్యూహాలు, మెలకువలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

కంప్యూటర్, కృత్రిమ మేధస్సుపై అవగాహన పెంచుకోవాలి - హెచ్. రమేష్

కేంద్ర మార్గదర్శకుడు హెచ్. రమేష్ మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కంప్యూటర్ పరిజ్ఞానం, కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక అంశాలపై అవగాహన కల్పించేందుకు శిక్షణ కేంద్రం అందుబాటులో ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ప్రయోగశాలను సందర్శించి కంప్యూటర్ వినియోగం, సాంకేతిక అంశాలపై ప్రాయోగిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల నైపుణ్య శిక్షణ కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్. కవిత, పూర్తికాల మార్గదర్శకుడు హెచ్. రమేష్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భూరీసర్వే ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్ రవి

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూనిపర్తి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు గ్రామంలో ఎన్ని ఎకరాల భూమి రీ సర్వే చేశారని, ఇంకా ఎన్ని ఎకరాల భూమిని రీ సర్వే చేయాల్సి ఉందననే వివరాలను అధికారులు, సర్వేయర్లను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి భూముల రీ సర్వే ను వేగవంతం చేయాలని సర్వేయర్లు, అధికారులకు సూచించారు. స్థానిక తహసిల్దార్ సురేష్ కుమార్, సర్వేయర్లు, ఇతర అధికారులతో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

పారదర్శకంగా భూముల రీ సర్వే

భూముల రీసర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

భూముల రీసర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

ఆత్మకూర్ లో భూ రీసర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలన

ప్రజా వాయిస్ హన్మకొండ /ఆత్మకూర్

భూముల రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం ఆత్మకూరు మండలం బ్రాహ్మణ పల్లి రెవెన్యూ లోని కామారం గ్రామం లో జరుగుతున్న భూముల రీ సర్వే తీరును హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంకా ఎన్ని ఎకరాలలో సర్వే పూర్తి



చేయాల్సి ఉందనే వివరాలను భూములు, కొలతలు శాఖ ఏడీ నూర్ సింగ్, సర్వేయర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎన్ని రోవర్లతో సర్వే నిర్వహిస్తున్నారని ఆరా తీశారు. అక్కడ ఉన్న స్థానిక రైతులతో సర్వే తీరు గురించి కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలన్నారు. అధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ భూముల సరిహద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాలను కచ్చితంగా నమోదు చేసే దిశగా రీసర్వే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. భూముల రీసర్వేను పూర్తి చేయడంలో రైతులు సహకరించాలని సూచించారు. సర్వే సమయం లో రైతులు తమ భూమి హద్దులను సరిగా చూపించాలని అన్నారు. సర్వేయర్లు సర్వే సమయం లో జాగ్రత్తలు వహించాలని సూచించారు. పారదర్శకంగా చేపడుతున్న భూముల రీసర్వేతో రైతుల భూ హక్కులకు భరోసా లభిస్తుందన్నారు. రీసర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు, సర్వేయర్లకు సూచించారు. ఈ కార్యక్రమం లో స్థానిక తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఇతర అధికారులు, సర్వేయర్లు, స్థానిక రైతులు, తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో ఆటో అడ్డాలపై పోలీసుల ఆంక్షలు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

ఎస్సై చలికంటి నరేష్

ప్రజా వాయిస్ ,హుజూర్ నగర్ , నవంబర్ 04

హుజూర్ నగర్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యల నివారణ, ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా పోలీసులు ఆటో రాకపోకలు, నిలుపుదలపై కఠిన ఆంక్షలు విధించారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కేసులు నమోదు చేస్తామని హుజూర్ నగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ చలికంటి నరేష్ హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్ మాట్లాడుతూ... పట్టణంలోని పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ పరిసరాల్లో ఎలాంటి ఆటో అడ్డాలకు అనుమతి లేదని తేల్చి చెప్పారు. బస్టాండ్ల వద్ద, ప్రధాన రహదారులకు ఇరువైపులా అస్తవ్యస్తంగా ఆటోలు నిలపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రయాణికులకు తీవ్ర విఘాతం కలుగుతోందని తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరలోనే ఆటో రాకపోకల క్రమబద్ధీకరణ చేపడతామన్నారు. అలాగే పాత బస్టాండ్ పరిసరాల్లో ప్రమాదాలు, దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పట్టణంలోని ఆటో డ్రైవర్లు, ఆటోల పూర్తి వివరాలను సేకరించి, ప్రతి ఆటోకు ప్రత్యేక నంబర్లు కేటాయిస్తామని వెల్లడించారు. ఆటో డ్రైవర్లందరూ పోలీసులకు పూర్తిగా సహకరించి, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

కరువు ప్రభావిత రైతుల పంట రుణాల పునర్వ్యవస్థీకరణకు చర్యలు చేపట్టాలి

ఖరీఫ్-2026 కరువు సహాయక చర్యలపై ప్రత్యేక డీసీసీ సమావేశం

ప్రజా వాయిస్ సంగారెడ్డి :

జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాలను పునరుద్ధరించి, రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు అర్హులైన రైతుల పంట రుణాల పునర్వ్యవస్థీకరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టరేట్ ఏఓ విజయలక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ టి. సుధీర్ కుమార్ బ్యాంకు అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖరీఫ్--2026 కరువు సహాయక చర్యల్లో భాగంగా ప్రత్యేక డీసీసీ/డీఎల్ఆర్ఎల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కరువు ప్రభావిత మండలాల్లో అర్హులైన రైతుల వ్యవసాయ పంట రుణాల పునర్వ్యవస్థీకరణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ ఏఓ విజయలక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ టి. సుధీర్ కుమార్, ఆర్‌బీఐ ఎల్‌డీఓ వి. ప్రదీప్ చంద్ర, నాబార్డ్ ఏజీఎం కృష్ణ తేజ, వ్యవసాయ శాఖ అదనపు డీఏ బి. శ్రీదేవి, వివిధ బ్యాంకుల అధికారులు హాజరయ్యారు. కరువు ప్రభావిత మండలాల్లోని అర్హులైన రైతుల పంట రుణాలను నిబంధనల ప్రకారం పునర్వ్యవస్థీకరించడం, రుణాల తిరిగి చెల్లింపు గడువును పొడిగించడం,తాత్కాలిక వాయిదా సదుపాయం) కల్పించే అంశాల పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఏఓ విజయలక్ష్మి మాట్లాడుతూ భారతీయ రిజర్వ్ బ్యాంకు మార్గదర్శకాలు, సంబంధిత బ్యాంకుల పాలక మండళ్లు ఆమోదించిన విధానాలకు అనుగుణంగా అర్హులైన రైతులకు సహాయక చర్యలు సకాలంలో అందేలా చూడాలని సూచించారు. పంట రుణాల పునర్వ్యవస్థీకరణకు అవసరమైన రైతుల వివరాలను సక్రమంగా సేకరించి, భద్రపరిచి, నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ టి. సుధీర్ కుమార్ మాట్లాడుతూ , ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ 2026 వరకు రెండు త్రైమాసికాల్లో జిల్లాలోని బ్యాంకులు మొత్తం 1,20,065 ఖాతాల ద్వారా రూ.2,520.18 కోట్ల పంట రుణాలను రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని మొత్తం 28 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా గుర్తించగా, వాటిలో 2



మండలాలు తీవ్ర కరువు ప్రభావిత మండలాలుగా, 26 మండలాలు మోస్తరు కరువు ప్రభావిత మండలాలుగా గుర్తించినట్లు వివరించారు. పంట రుణాల పునర్వ్యవస్థీకరణ మాత్రమే ఈ ప్రక్రియలో భాగమని, దీనిని రుణమాఫీ పథకంగా భావించరాదని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్‌బీఐ ఎల్‌డీఓ వి. ప్రదీప్ చంద్ర, నాబార్డ్ ఏజీఎం కృష్ణ తేజ, వ్యవసాయ శాఖ అదనపు డీఏ బి. శ్రీదేవి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నిందితులకు శిక్షలు పడేలా కృషి చేసిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను అభినందించిన సీపీ రష్మీ పెరుమాళ్

ప్రజా వాయిస్: సిద్దిపేట

ఈ సంవత్సరంలో మొత్తం 16 వివిధ కేసుల్లో నిందితులకు శిక్షలు ఖరారయ్యేలా అద్భుత ప్రతిభ కనబరిచిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాదుల ఆత్మారాములును పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ ఘనంగా అభినందించి, సత్కరించారు. ఈ 16 కేసుల్లో 13 కేసులలో నిందితులకు 20 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ కాలం జైలు శిక్ష పడేలా ప్రాసిక్యూషన్ విజయవంతంగా వాదనలు వినిపించింది. కోర్టు విచారణ సమయంలో పక్కా ఆధారాలు సమర్పించి, సమర్థవంతమైన వాదనలు వినిపించి తీవ్ర నేరాలకు పాల్పడిన నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా చేయడంలో సాదుల ఆత్మారాములు చూపిన చొరవ, నిబద్ధతను సీపీ ప్రత్యేకంగా కొనియాడారు. బాధితులకు త్వరితగతిన న్యాయం చేకూర్చడంలో ప్రాసిక్యూటర్ పాత్ర అత్యంత కీలకమైనదని, ఆత్మారాములు గారి సేవలు పోలీస్ సిబ్బందికి మరియు ప్రాసిక్యూషన్ విభాగానికి ఆదర్శనీయమని సీపీ తెలిపారు. ఈ సందర్భంగా సాదుల ఆత్మారాములుకు శాలువా కప్పి, మెమంటో అందించి సీపీ రష్మీ పెరుమాళ్ ఘనంగా సత్కరించారు.



రీ సర్వే పనుల పరిశీలన కలెక్టర్ బి.సత్యప్రసాద్ క్షేత్ర పర్యటన

ప్రజా వాయిస్, మేడిపల్లి:

మేడిపల్లి మండలం వల్లంపల్లి, తొంబారావుపేట్ గ్రామాల్లో భూముల రీ సర్వే పురోగతిని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా హద్దులు, విస్తీర్ణం క్షుణ్ణంగా నమోదు చేసి, రికార్డుల్లో ఖచ్చితత్వంతో పారదర్శకంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, మేడిపల్లి తహశీల్దార్, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో లోపాలు వెంటనే సరిచేయాలి

మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

ప్రజా వాయిస్ | హుజూర్‌నగర్ |నవంబర్ 04

హుజూర్‌నగర్‌లోని డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణ పనుల్లో ఏవైనా చిన్నచిన్న లోపాలు ఉన్నా వెంటనే సరిచేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇండ్ల సముదాయాల్లో మిగిలిపోయిన పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. హుజూర్‌నగర్‌లోని రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీ డబుల్ బెడ్రూమ్ ఇళ్లను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కే. నరసింహతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇటీవల మంత్రి ఇచ్చిన ఆదేశాల మేరకు హౌసింగ్ యూనిట్లలోని ప్రతి బ్లాక్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఇళ్లలో ఉన్న చిన్నచిన్న లోపాలను గుర్తించి, వాటిని వెంటనే సరిదిద్దాలని సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణ పనులతో పాటు డ్రైనేజీ, తాగునీరు, రహదారులు తదితర మౌలిక వసతుల కల్పన పనులను కూడా వేగవంతం చేయాలని సూచించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పంచభూతాలపైనా వ్యాపారమేనా.?

ప్రకృతిని కొల్లగొడుతున్న మనిషి.. చివరకు తన మనుగడనే పణంగా పెడుతున్నాడా.?

గాలికి ధర.. నీటికి రేటు.. నేలకు మార్కెట్ విలువ.. అడవులకు గొడ్డలిపెట్టు

అభివృద్ధి ముసుగులో ప్రకృతి విధ్వంసం..

సహజ వనరులన్నీ వ్యాపార వస్తువులుగా మారుతున్న వైనం..

పచ్చని పొలాలు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా..

చెరువులు ఆక్రమణలకు నిలయాలుగా..

రేపటి తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు, సారవంతమైన నేల మిగిలేనా?

ప్రజా వాయిస్, ప్రత్యేక కథనం:

ప్రకృతి మనిషికి ఇచ్చిన గొప్ప సంపద ఏమిటి? గాలి, నీరు, నిప్పు, నేల, ఆకాశం. ఈ పంచభూతాలు లేకుండా జీవం లేదు. వీటిపై ఏ ఒక్కరికీ యాజమాన్య హక్కులు లేవు. ఇవి ఏ ప్రభుత్వానికో, కార్పొరేట్ సంస్థకో, సంపన్నుడికో సొంతమైన ఆస్తులు కావు. సమస్త జీవరాశుల మనుగడకు ప్రకృతి అందించిన ఉచిత వరాలు. కానీ కాలం మారింది. ప్రకృతిని ఆరాధించిన మనిషి.. ఇప్పుడు దానిని ఆర్జనకు మార్గంగా మార్చుకున్నాడు. చెట్లను నరికేసి ఆక్సిజన్ కోసం యంత్రాలను ఆశ్రయిస్తున్నాడు. చెరువులను కబ్జా చేసి బాటిళ్లలో నీటిని కొనుక్కుంటున్నాడు. పంట పొలాలను ప్లాట్లుగా మార్చి ఆహార భద్రతను ప్రమాదంలోకి నెడుతున్నాడు. కొండలను తవ్వుతూ, అడవులను ధ్వంసం చేస్తూ అభివృద్ధి సాధిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నాడు. ప్రకృతిపై పెత్తనం చెలాయిస్తున్నానని విర్రవీగుతున్న మనిషి.. చివరకు తన ఉనికినే ప్రశ్నార్థకం చేసుకుంటున్నాడా?

గాలిని కూడా కొనుక్కునే రోజులు

ఒకప్పుడు పల్లెల్లో చెట్ల మధ్య నడిస్తే చాలు.. స్వచ్ఛమైన గాలి పలకరించేది. పొలాల గట్లపై, అడవుల ఒడిలో, చెరువుల పరిసరాల్లో ప్రకృతి సహజంగా ప్రాణవాయువును అందించేది. కానీ అభివృద్ధి పేరుతో అడవులను నరికేశాం. చెట్లను కూల్చేశాం. పరిశ్రమల కాలుష్యాన్ని పెంచాం. వాహనాల పొగతో గాలిని విషతుల్యం చేశాం. ఫలితంగా స్వచ్ఛమైన గాలి కూడా అరుదైన వనరుగా మారుతోంది. గాలి నాణ్యత పడిపోతుంటే గాలి శుద్ధి యంత్రాలు, ఆక్సిజన్ పరికరాలకు డిమాండ్ పెరుగుతోంది. ప్రకృతి ఉచితంగా ఇచ్చిన ప్రాణవాయువును మనిషి తన చేతులతో కలుషితం చేసి, తిరిగి డబ్బు పెట్టి శుద్ధి చేసుకునే దుస్థితిని సృష్టించుకున్నాడు. చెట్టును నరికినప్పుడు కలిగే నష్టం వెంటనే కనిపించకపోవచ్చు. కానీ దాని ప్రభావం తరతరాలపై పడుతుంది.

నీరు.. ప్రకృతి వరం నుంచి మార్కెట్ సరుకుగా.!

నీరు జీవనాధారం. ఒకప్పుడు గ్రామాల్లో చెరువులు, బావులు, వాగులు, వంకలు ప్రజల దాహాన్ని తీర్చేవి. వర్షపు నీటిని నిల్వ చేసుకునే సంప్రదాయ వ్యవస్థలు గ్రామీణ జీవనానికి వెన్నెముకగా ఉండేవి. ఇప్పుడు పరిస్థితి తలకిందులైంది. చెరువులు కబ్జాలకు గురవుతున్నాయి. భూగర్భ జలాలను విచక్షణారహితంగా తోడేస్తున్నారు. నదుల్లోకి వ్యర్థాలను వదులుతున్నారు. చివరకు తాగునీరు సైతం నీసాల్లో, ప్యాకెట్లలో బంధించి విక్రయిస్తున్నారు. డబ్బున్నవారు శుద్ధి చేసిన నీటిని కొనుక్కుంటున్నారు. సామాన్యులు మాత్రం అందుబాటులో ఉన్న నీటి నాణ్యతపై ఆందోళన చెందుతున్నారు. రేపు స్వచ్ఛమైన నీరు ప్రకృతి నుంచి అందరికీ అందుతుందా? లేక కొనగలిగిన వారికే పరిమితమవుతుందా? నీటిని వస్తువుగా చూడటం మొదలుపెట్టిన సమాజం.. దాని సామాజిక విలువను మరిచిపోతోందా?

భూమాతను రియల్ ఎస్టేట్‌గా మార్చేశాం.!

భూమి అంటే కేవలం గజాలు, ఎకరాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు కాదు. అది అన్నం పెట్టే అమ్మ. రైతు చెమటకు ప్రతిఫలంగా పంటను అందించే జీవనాధారం. కానీ నేడు పచ్చని పంట పొలాలు వెంచర్లుగా మారుతున్నాయి. వ్యవసాయ భూములు ప్లాట్లుగా విభజించబడుతున్నాయి. చెరువులు, కుంటలు, వాగుల పరిసరాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. కొండలు, గుట్టలు మట్టి, రాయి వ్యాపారానికి బలవుతున్నాయి. ఒక ఎకరం భూమి పంట పండిస్తే వందల కుటుంబాలకు ఆహారం అందించగలదు. అదే భూమి ప్లాట్లుగా మారితే కొందరికి ఆర్థిక లాభం రావచ్చు. కానీ సమాజం కోల్పోయేది ఆహార భద్రతను, పర్యావరణ సమతుల్యతను, భవిష్యత్తు తరాల జీవనాధారాన్ని. భూమి ధరను గజాల్లో లెక్కిస్తున్నాం. కానీ ఆ భూమి పండించే అన్నం విలువను మరిచిపోతున్నాం.

నేలలో విషం.. ఆహారంలో అవశేషాలు.!

అధిక దిగుబడుల కోసం వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం పెరుగుతోంది. అవసరానికి మించి వాటిని ఉపయోగించడం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతినడం, నీటి వనరులు కలుషితమవడం, జీవవైవిధ్యం తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఆహారంలో రసాయన అవశేషాలపై ఆందోళనలు పెరుగుతున్నాయి. పంట దిగుబడులే లక్ష్యంగా పెట్టుకుని నేల సహజ స్వభావాన్ని విస్మరిస్తే భవిష్యత్తులో వ్యవసాయానికే ముప్పు ఏర్పడుతుంది. రైతు పండించే పంట మనిషికి ఆరోగ్యాన్ని ఇవ్వాలి. కానీ అదే పంట విషతుల్యమయ్యే పరిస్థితులు వస్తే దానికి బాధ్యులెవరు? అధిక దిగుబడుల కంటే ఆరోగ్యకరమైన నేల, సురక్షితమైన ఆహారమే సమాజానికి నిజమైన సంపద కావాలి.

రుతువుల గతి తప్పుతోందా.?

ఒకప్పుడు కాలానికి అనుగుణంగా వర్షాలు, చలి, ఎండలు వచ్చేవి. రైతులు రుతువులను అంచనా వేసుకుని సాగు చేసుకునేవారు. ఇప్పుడు వాతావరణ పరిస్థితులు అనిశ్చితంగా మారుతున్నాయి. ఎక్కడో అతివృష్టి.. మరెక్కడో అనావృష్టి. ఒకవైపు తీవ్రమైన వేడిగాలులు.. మరోవైపు అసాధారణ వాతావరణ పరిస్థితులు. అడవుల నరికివేత, గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలు, కాలుష్యం, భూవినియోగ మార్పులు వాతావరణ మార్పులను తీవ్రతరం చేస్తున్నాయి. వర్షం ఎప్పుడు పడుతుందో తెలియక రైతు ఆందోళన చెందుతున్నాడు. పంట చేతికి వస్తుందో లేదో తెలియక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. ప్రకృతి క్రమం తప్పిందని అంటున్నాం. కానీ ఆ క్రమాన్ని దెబ్బతీస్తున్నది మనిషి చర్యలేనన్న వాస్తవాన్ని గుర్తిస్తున్నామా?

అభివృద్ధి అంటే ప్రకృతి విధ్వంసమేనా.?

రోడ్లు కావాలి.. పరిశ్రమలు రావాలి.. విద్యుత్తు ఉత్పత్తి కావాలి.. ఆధునిక సాంకేతికత అందుబాటులోకి రావాలి. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. ఇందులో ఎలాంటి సందేహం లేదు. కానీ అభివృద్ధి పేరుతో అడవులను అంతం చేయడం, నదులను కలుషితం చేయడం, పంట పొలాలను మాయం చేయడం, కొండలను ధ్వంసం చేయడం ఎంతవరకు సమంజసం? ప్రకృతిని నాశనం చేసి నిర్మించిన భవనాలు ఆకాశాన్ని తాకవచ్చు. పరిశ్రమల ఉత్పత్తి పెరగవచ్చు. ఆర్థిక వ్యవస్థ పరుగులు తీయవచ్చు. కానీ మనిషికి శ్వాసించడానికి స్వచ్ఛమైన గాలి లేకపోతే, తాగడానికి మంచి నీరు లేకపోతే, తినడానికి సురక్షితమైన ఆహారం లేకపోతే ఆ అభివృద్ధికి అర్థం ఏమిటి? అభివృద్ధి అనేది ప్రకృతిని జయించడం కాదు.. ప్రకృతితో కలిసి ముందుకు సాగడం.

భావితరాలకు మిగిలేది ఏమిటి.?

మన పూర్వీకులు కాపాడిన చెరువులు, అడవులు, పచ్చని పొలాలు, సహజ నీటి వనరులు మనకు జీవనాధారంగా నిలిచాయి. మరి మనం మన పిల్లలకు ఏమి అందిస్తున్నాం? కనుమరుగవుతున్న అడవులనా? ఎండిపోతున్న చెరువులనా? కలుషితమైన నదులనా? సారాన్ని కోల్పోతున్న నేలనా? పెరుగుతున్న ఉష్ణోగ్రతలా? డబ్బు పెట్టి కొనాల్సిన గాలినా, నీరా? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాలకే కాదు.. ప్రతి పౌరుడిపైనా ఉంది. ప్రకృతి వనరులను కాపాడటంలో పాలకులు, పారిశ్రామిక సంస్థలు, స్థానిక సంస్థలు, రైతులు, ప్రజలు తమవంతు బాధ్యత నిర్వర్తించాలి. ప్రకృతి విధ్వంసాన్ని అరికట్టేందుకు చట్టాలు ఉండటమే కాదు.. వాటి అమలు కూడా కఠినంగా ఉండాలి.

పరిష్కారం ప్రకృతితో సహజీవనమే

ప్రకృతిని కాపాడుకోవడం అంటే అభివృద్ధిని ఆపడం కాదు. పర్యావరణానికి నష్టం కలగకుండా అభివృద్ధిని కొనసాగించడం. విచక్షణారహితంగా చెట్ల నరికివేతను అరికట్టి స్థానిక జాతుల మొక్కలను పెంచాలి. చెరువులు, కుంటలు, వాగులు, నదులను ఆక్రమణల నుంచి రక్షించాలి. ప్రతి గ్రామం, పట్టణంలో వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి. పంట భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి. నేల ఆరోగ్యాన్ని కాపాడే వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలి. పరిశ్రమల కాలుష్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచాలి. పర్యావరణ పరిరక్షణను పాఠశాల స్థాయి నుంచే విద్యలో భాగం చేయాలి. ఇవన్నీ ప్రభుత్వ బాధ్యతలే కాదు.. ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమయ్యే లక్ష్యాలు.

ప్రకృతిని అమ్ముకుంటే.. మనుగడను కొనలేం

మనిషి ప్రకృతిని జయించానని అనుకుంటున్నాడు. కానీ అతని పుట్టుక నుంచి అంతిమ ప్రయాణం వరకు ప్రతి అడుగులోనూ ప్రకృతిపైనే ఆధారపడుతున్నాడు. గాలిని అమ్మకానికి పెట్టాం. నీటిని సీసాల్లో బంధించాం. భూమిని ప్లాట్లుగా మార్చాం. అడవులను నరికేశాం. కొండలను తవ్వేశాం. నేలను కలుషితం చేశాం. ఇవన్నీ చేసి చివరికి మన ఆరోగ్యాన్ని, మన ఆహారాన్ని, మన భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టుకుంటున్నాం. డబ్బుతో బాటిల్ నీటిని కొనగలం.. కానీ వర్షాన్ని కొనలేం. యంత్రాలతో గాలిని కొంతమేర శుద్ధి చేసుకోవచ్చు.. కానీ అడవుల సహజ వ్యవస్థను ఒక్కరోజులో సృష్టించలేం. భూమిని కొనగలం.. కానీ సారవంతమైన నేలను వెంటనే తయారు చేయలేం. ప్రకృతిని నాశనం చేయడానికి కొన్ని సంవత్సరాలు చాలు. తిరిగి పునరుద్ధరించడానికి తరాలు పట్టవచ్చు. పంచభూతాలు వ్యాపార వస్తువులు కావు.. అవి జీవనానికి పునాదులు. ప్రకృతి మనిషి సొత్తు కాదు.. మనిషి ప్రకృతిలో ఒక భాగం మాత్రమే. ఈ వాస్తవాన్ని గుర్తించకపోతే భవిష్యత్తులో మనిషి తన పిల్లలకు కోట్ల ఆస్తులు, అంతస్తులు ఇచ్చినా.. జీవించడానికి అవసరమైన స్వచ్ఛమైన గాలి, నీరు, సారవంతమైన నేలను అందించలేని దుస్థితి ఎదురవుతుంది. ప్రకృతిని కాపాడటం అంటే భూమిని కాపాడటం మాత్రమే కాదు.. మనల్ని మనం కాపాడుకోవడం. ప్రకృతిపై పెత్తనం చెలాయించాలనే ఆలోచనను విడిచిపెట్టి, దానితో సహజీవనం చేయడం నేర్చుకోవాలి. ఎందుకంటే ప్రకృతిని వ్యాపారంగా మార్చుకున్న మనిషి.. చివరికి తన మనుగడనే కొనుక్కోవాల్సిన పరిస్థితి తెచ్చుకోకూడదు...



కోటియా నాయక్ భూక్యా కోదాడ

మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలి..

- అర్వీలు లక్ష్యాలను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి

- ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళలకు రుణాలు, స్వయం ఉపాధి యూనిట్లు

- మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

ప్రజా వాయిస్, జమ్మికుంట (నవంబర్ 04):

జమ్మికుంట పట్టణ పరిధిలోని అర్వీల పనితీరుపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ అర్వీలకు నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు అందేలా కృషి చేయడంతో పాటు, ఇందిరా మహిళా శక్తి పథకం కింద వివిధ స్వయం ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా చేసుకుని అర్వీలు బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రభుత్వ పథకాలు అర్హులైన మహిళలకు చేరేలా సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఇన్‌చార్జి టీఎంసీ మల్లీశ్వరి, సీఏల్‌ఆర్వీలు జ్యోతి, మంజుల, అర్వీలు తదితరులు పాల్గొన్నారు.



ప్రతి గింజను ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది..!

- నిజాయితీగల ప్రభుత్వం ' కాంగ్రెస్ '
- రైతులను ఆగం చేస్తున్న టిఆర్ఎస్ నేతలు
- రైతులు అధైర్యం పడవద్దు అండగా ఉంటాం
- బీఆర్ఎస్ నేతల వల్ల దళారులకు కాసుల వర్షం...
- పాయిజన్ డబ్బులతో పదవులు తీసుకోలే..?
- మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి

ప్రజా వాయిస్ / దుబ్బాక:

రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ప్రతి గింజలు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, బీఆర్ఎస్ నాయకులు రైతులను ఆందోళనకు గురి చేస్తూ ఆగం చేస్తున్నారని దుబ్బాక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి అన్నారు. బుధవారం మార్కెట్ కార్యాలయం వద్ద చేసిన సమావేశంలో మాట్లాడుతూ... ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తన అనుచరులతో ఇలాంటి కుట్రలు చేయడం సరైనది కాదని మండిపడ్డారు రైతులను అపోహలకు గురి చేస్తూ స్వార్థపు రాజకీయ ప్రయోజనాల కోసం లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని చాలా బాధాకరమైన అంశమని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి రైతు ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని అధైర్య పడవద్దని పేర్కొన్నారు. ప్రతి గింజను తామే స్వయంగా కొనుగోలు కేంద్రాల వద్ద పర్యవేక్షించి కొనుగోలు విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలవకుండా అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తెలిపారు. ప్రస్తుత బీఆర్ఎస్ నేతల వల్ల రైతులకు అన్యాయం జరుగుతుందని.. దరార్లకు కాసుల వర్షం కురుస్తుందన్నారు. గత ఏడాది తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి ప్రభుత్వం కాంగ్రెస్ అని గుర్తు చేశారు. రైతు సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అని అన్నారు. దుబ్బాకలో కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు మూడు రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తామని అన్నారు. తాము పదవులను కొనుక్కోలేదని అన్నారు. గతంలో పాయిజన్ డబ్బా చేతుల పట్టుకొని పదవి ఇస్తావా.. చావాలా అని



పదవులు అనుభవించిన వారు నేడు రైతులు తప్పుదోవ పట్టించడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో , కౌన్సిలర్ లు తునికి సురేష్, కాంగ్రెస్ నాయకులు ఐరేని సాయి తేజ గౌడ్, శ్రీరామ్ నరేందర్, కాంగ్రెస్ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షులు మల్లుగారి రామచంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఎన్ ఆర్ ఎస్ విద్యార్థి ప్రతిభ

ప్రజా వాయిస్,కోదాడ:

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం భువనగిరిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ 17 వాలీబాల్ పోటీల్లో కోదాడ పట్టణానికి చెందిన ఎన్ ఆర్ ఎస్ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి తేజశ్రీ ఉమ్మడి నల్గొండ జిల్లా జట్టుకు ఎంపికైంది. అంతేకాక ఆ పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి బెస్ట్ ప్లేయర్ అవార్డు పొందింది. ఈ సందర్భంగా బుధవారం కాలేజీలో జరిగిన కార్యక్రమంలో తేజశ్రీని కాలేజీ చైర్మన్ వడ్డే రాజేష్ చౌదరి, డైరెక్టర్ మనోహర్ రెడ్డి, కరస్పాండెంట్ వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ జీ వీ, వైస్ ప్రిన్సిపల్ పీ ఎన్ ఆర్ తో పాటు పలువురు లెక్చరర్లు అభినందించారు. తేజశ్రీ భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు సాధించాలని వారు కోరారు.

చెత్త ఏరుకునే సాకుతో దొంగతనాలు

నలుగురు మహిళల అరెస్ట్ రిమాండ్

విరిపై వేర్వేరు జిల్లాల్లో అనేక దొంగతనాల కేసులు నమోదయ్యాయి
అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి
ఎస్సై రాజ్ కుమార్

ప్రజా వాయిస్ ,కొత్తగూడ

చెత్త, ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకునే నెపంతో ఇళ్ల వద్దకు వచ్చి, సమయం చూసి వస్తువులు, ఎలక్ట్రిక్ వైర్లు దొంగిలిస్తున్న నలుగురు కిలాడీ మహిళలను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.వార్తా వివరాల్లోకి వెళ్తే:నిన్న మహబూబాబాద్ మండల పరిధిలోని కోనాపురం గ్రామంలో నలుగురు మహిళలు చెత్త ఏరుకునేందుకు వచ్చారు. గ్రామానికి చెందిన కట్కూరి కృష్ణారెడ్డి ఇంటి వద్దకు వెళ్లి తాగడానికి మంచినీళ్లు కావాలని కోరారు. ఆయన నీళ్లు తీసుకురావడానికి ఇంట్లోకి వెళ్లిన వెంటనే, బయట ఉంచిన ఎలక్ట్రిక్ వైరును దొంగిలించి పరారయ్యేందుకు ప్రయత్నించారు. దీనిని



గమనించిన బాధితుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.రంగంలోకి దిగిన పోలీసులు సదరు నలుగురు మహిళలను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని స్థానిక ఎస్ఐ రాజ్ కుమార్ తెలియజేశారు

అరెస్టయిన నిందితుల వివరాలు:

1: తూర్పాటి లక్ష్మి (50), భర్త: యాదగిరి, నివాసం: మడికొండ గ్రామం, కాజీపేట మండలం.

2: తూర్పాటి పద్మ, తండ్రి: ఉప్పలయ్య, నివాసం: మడికొండ గ్రామం, కాజీపేట మండలం.

3: కడకంచి సారమ్మ (20), భర్త: మల్లయ్య, నివాసం: శివాజీనగర్, ఉప్పలగట్టు, వరంగల్.

4: సొగాల సమ్మక్క (28), భర్త: ఉప్పలయ్య, నివాసం: శివాజీనగర్, ఉప్పలగట్టు, వరంగల్.

(వీరందరూ బుడగ జంగాలు (ఎస్సీ) వర్గానికి చెందినవారు).

పాత నేరస్థులే..!

ఈ నలుగురు మహిళలపై గతంలోనూ వేర్వేరు జిల్లాల్లో అనేక దొంగతనాల కేసులు నమోదయ్యాయని, జైలుకు కూడా వెళ్లి వచ్చారని పోలీసులు తెలిపారు. శిక్ష అనుభవించి బయటకు వచ్చినప్పటికీ, ప్రవర్తన మార్చుకోకుండా మళ్లీ ఊళ్లమ్మట తిరుగుతూ ఇలాంటి దొంగతనాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

పోలీసుల విజ్ఞప్తి

గ్రామాలు, కాలనీల్లోకి వచ్చే అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే తక్షణమే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.



నరహరి తండా ప్రజల దశబ్దాల నిరీక్షణకు తెర

రోడ్డు నిర్మాణానికి శ్రీకారం...
సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి బుధవారం

ప్రజా వాయిస్ భీమదేవరపల్లి.

భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ నరహరి తండా ప్రజల దశాబ్దాల కల అయిన రోడ్డు నిర్మాణానికి ఎట్టకేలకు శ్రీకారం చుట్టారు. రోడ్డు నిర్మాణానికి మంజూరు లభించడంతో ముల్కనూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి బుధవారం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే నరహరి తండా ప్రజలకు దశాబ్దాలు ఎదురవుతున్న రాకపోకలకు ఇబ్బందులు తొలగి రవాణా సౌకర్యం మెరుగుపడునుంది. గ్రామాలు తండాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతమిస్తూ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళుతున్న సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డికి తండా ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు

కరువు ప్రభావిత రైతులకు.. బ్యాంకుల ద్వారా ఆర్థిక ఉపశమన చర్యలు అమలు చేయాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

ప్రజా వాయిస్,వరంగల్ చెన్నారావుపేట :

అర్హులైన రైతుల పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, రుణ చెల్లింపు గడువు పొడిగింపునకు చర్యలు.తదుపరి వ్యవసాయ సీజన్‌కు కొత్త పంట రుణాలు మంజూరు చేయాలి వరంగల్ జిల్లాలో కరువు ప్రభావిత మండలాలకు చెందిన రైతులకు బ్యాంకుల ద్వారా ఆర్థిక ఉపశమన చర్యలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బ్యాంకు అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కరువు ప్రభావిత రైతులకు ఆర్థిక ఉపశమన చర్యల అమలుపై ప్రత్యేక జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ) సమావేశం నిర్వహించారు.ఎస్ ఎల్ బీసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బిఐ) మార్గదర్శకాల మేరకు ఈ సమావేశంలో రైతులకు అందించాల్సిన ఉపశమన చర్యలపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కరువు పరిస్థితుల నేపథ్యంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హులైన రైతులకు బ్యాంకుల ద్వారా అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించాలని సూచించారు.రైతుల పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, రుణాల చెల్లింపు గడువుల పొడిగింపు, నిబంధనల ప్రకారం మారటోరియం సదుపాయం కల్పించడం,తదుపరి వ్యవసాయ సీజన్‌కు కొత్త పంట రుణాలు మంజూరు చేయడం వంటి చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు.ప్రభుత్వ శాఖలు,బ్యాంకు అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ కరువు ప్రభావిత మండలాల్లో అర్హులైన రైతులను గుర్తించాలని, వారికి వర్తించే మార్గదర్శకాల ప్రకారం నిర్ణీత గడువులోగా ఉపశమన చర్యలు అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.సమావేశంలో అదనపు కలెక్టర్లు కిషోర్ (రెవెన్యూ), గణేష్ (లోకల్ బాడీస్),యూనియన్ బ్యాంక్ డీజీఎం జి.



కమలాకర్,ఆర్బీఐ ఎల్‌డీఓ యశ్వంత్, నాబార్డ్ డీడీఎం చైతన్య రవి,లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జి. జీవన్ కుమార్,సభ్య బ్యాంకుల ప్రతినిధులు,వ్యవసాయ,పశు సంవర్ధక,ఉద్యానవన,మత్స్యశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

నాసిరకం విత్తనాలను అరికట్టాలి
రైతులు సంతోషంగా ఉంటేనే దేశం బాగుపడుతుంది
రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ర్యకల శ్రీశైలం

ప్రజావాయిస్ /

బొమ్మలరామారం

మండలం



యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం రైతులు సమస్యలు లేకుండా జీవించినప్పుడే దేశం బాగుపాడుతుంది రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ర్యకల శ్రీశైలం అన్నారు. మంగళవారం రోజున బొమ్మలరామారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర అప్పుల నుంచి విముక్తి సాగునీరు నాణ్యమైన విత్తనాలు దొరికినప్పుడే మరియు రైతు సంతోషంగా ఉన్నపుడే దేశం బతుకుతుంది. గౌరవప్రదమైన జీవితం లభించినప్పుడే వ్యవసాయ రంగం బలోపేతమవుతుందన్నారు . నల్లగొండలో జరగనున్న 36వ ఏఐకేఎస్ జాతీయ మాహాసభలు రైతంగా సమస్యలను జాతీయస్థాయిలో చర్చించడానికి భవిష్యత్ రైతు ఉద్యోమాల దిశను నిర్ణయించడానికి ఒక ముఖ్యమైన వేదికగా నీలవనుంది అన్నారు. మహాసభల ప్రధాన ప్రధాన్యం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను జాతీయస్థాయిలో చర్చించడం రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు ఉద్యమాన్ని పలోపేతం చేయడం రైతుల రుణభారాన్ని తగ్గించేందుకు చర్యలను తీసుకోవాలని కోరుతామన్నారు. ఎరువులు విత్తనాల ధరల నియంత్రణ కోసం డిమాండ్ చేయడం కౌలు రైతులు వ్యవసాయ కార్మికుల సమస్యలకు పరిష్కారాలు కోరడం సాగునీరు పంటల బీమా పంట నష్టపరిహారంపై ప్రభుత్వాలను ఒత్తిడి చేయడం రైతు సంఘాల మధ్య ఐక్యతను పెంపొందించడం భవిష్యత్ లో చేపట్టిల్సిన రైతంగ ఉద్యమాలకు కార్యచరణ రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ బాలరాజు దేవేందర్ రమేష్ మల్లేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైలు స్టేషన్ రైటర్లకు 12 రోజుల ప్రత్యేక శిక్షణ పూర్తి..

పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత..

ప్రజా వాయిస్,వరంగల్

చెన్నారావుపేట :



వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎస్సైలు,స్టేషన్ రైటర్లకు కేసుల దర్యాప్తు,కోర్టు విధానాలపై నైపుణ్యాన్ని పెంపొందించేందుకు పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అక్టోబర్ 22న ప్రారంభమైన 12 రోజుల ప్రత్యేక శిక్షణ తరగతులు నవంబర్ 4న ముగిశాయి.ఈ శిక్షణలో భాగంగా కేసుల దర్యాప్తు విధానం,శాస్త్రీయ ఆధారాల సేకరణ,సాక్షుల విచారణ,వివిధ శాఖల నుంచి అవసరమైన ఆధారాల సేకరణ,చార్జిషీట్ల తయారీ,కోర్టులో సాక్షుల హాజరు,పటిష్టమైన ఆధారాలతో నేరస్థులకు శిక్షలు పడేలా కేసులను నిరూపించడం వంటి కీలక అంశాలపై శిక్షణ అందించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, మాట్లాడుతూ, నాణ్యమైన దర్యాప్తు, పకడ్బందీగా ఆధారాల సేకరణ, సమర్థవంతమైన ప్రాసిక్యూషన్ ద్వారా కేసులను పకడ్బందీగా నిరూపించేలా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అధికారుల పనితీరు, దర్యాప్తులో చూపే ప్రతిభ,కేసుల పరిష్కారంలో సాధించే ఫలితాలను బట్టి ప్రతిభ కనబరిచిన అధికారులకు అవార్డులు,రివార్డులు అందజేస్తామని పోలీస్ కమిషనర్ తెలిపారు.దర్యాప్తులో ప్రతి అంశానికి ప్రాధాన్యతనిస్తూ,చట్టపరమైన విధానాలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్,సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత,వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్,సిసిఆర్బి ఏసీపీ దేవిడ్ రాజ్, సీసీఎస్ ఏసీపీ సదయ్య,ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్,సిసి ఆర్బి ఇన్స్పెక్టర్ దామోదర్ రెడ్డి తో పాటు ఇతర పోలీస్ అధికారులు,ఎస్సైలు,స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై ఎమ్మెల్సీ కోటిరెడ్డి సమీక్ష

ప్రతి డివిజన్‌లో ఇంటింటి ప్రచారం చేపట్టి ఓటరు నమోదును వేగవంతం చేయాలి

ప్రజా వాయిస్,నల్లగొండ:

నల్లగొండ నగరపాలక సంస్థ పరిధిలో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంపై ఎమ్మెల్సీ ఎం.సి. కోటిరెడ్డి ఆధ్వర్యంలో కేబీఆర్ క్యాంపు కార్యాలయంలో డివిజన్ ఇన్‌చార్జిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోటిరెడ్డి మాట్లాడుతూ నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకునే లక్ష్యంతో డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు కృషి చేయాలని సూచించారు. నగరంలోని ప్రతి డివిజన్, ప్రతి వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించి అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదును వేగవంతం చేయాలని నాయకులకు, ఎన్‌రోలర్లకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నగర ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జిలు, గ్రాడ్యుయేట్ ఎన్‌రోలర్లు పాల్గొన్నారు.

మహిళను వేధిస్తూ వెంటపడుతున్న యువకుడి అరెస్ట్

ప్రజావాయిస్/ తుర్కపల్లి



మహిళను వేధిస్తూ వెంటపడుతున్న యువకున్ని అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు ఎస్సై ఎం శివకృష్ణ తెలిపారు. బుధవారం తుర్కపల్లి పోలీస్ స్టేషన్లో ఆయన మాట్లాడుతూ తుర్కపల్లి మండలం రుస్తాపురం గ్రామానికి చెందిన వంగూరి చందు గత కొన్ని రోజులుగా ఒక మహిళను వేధిస్తూ ఆమె వెంటపడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, ఈ వేధింపులు భరించలేక బాధిత మహిళ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగిందని అన్నారు .ఈ క్రమంలో నిందితుడు వంగోరి చెందును అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరిచి జుడిషియల్ రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. మహిళలు, బాలికలను వేధించడం వెంట పడడం మహిళలకు సంబంధించిన ఇతర నేరాలకు పాల్పడే వారిపై పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మహిళలు, బాలికల పట్ల ఎవరైనా వేధింపులకు పాల్పడితే భయపడకుండా వెంటనే సమీప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని తెలిపారు

చొరబాటుదారులను అడ్డుకోవడంలో బిజెపి ప్రభుత్వం విఫలం

బీఎస్పీ నాయకుడు పచ్చిమట్ల రవీందర్ గౌడ్ తీవ్ర ధ్వజం

ప్రజా వాయిస్ హుస్నాబాద్

దేశంలోకి చొరబాటుదారులు చొరబడుతుంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏం చేస్తుందో ప్రజలకు సమాధానం చెప్పాలని హుస్నాబాద్ నియోజకవర్గ బీఎస్పీ పార్టీ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణ పర్యటనకు వచ్చిన కేంద్ర హోంశాఖ మంత్రి చొరబాటుదారులను దేశం నుండి తరిమికొడతామని మాట్లాడటం విడ్డూరంగా ఉందని, గత 12 సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వంలో దాదాపు మూడు కోట్ల మంది చొరబాటుదారులు దేశంలోకి వస్తుంటే రక్షణ వ్యవస్థ ఏం చేస్తుందో సమాధానం చెప్పాలని అన్నారు.ఎలక్షన్ కమిషన్ తీసుకుంటున్న కొన్ని తప్పుడు నిర్ణయా ల వల్ల దేశంలో 13 కోట్ల 50 లక్షల ఓట్లు అన్యాయంగా పోతున్నాయని, ఇందుకు బాధ్యత వహిస్తూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయని తెలిపారు. ఫామ్ 6 సవరణల విషయంలో పార్లమెంటు ఎటువంటి నిర్ణయం తీసుకోకముందే, గత 25 సంవత్సరాల నుండి ఓటర్ల తల్లిదండ్రులు ఎక్కడ ఓటు వేశారనే వివరాలు అడగడం గందరగోళానికి దారితీసిందన్నారు. తనతో పాటు పనిచేస్తున్న ఇద్దరు కమిషనర్ల అభ్యంతరాలను కూడా పట్టించుకోకుండా బిజెపి ప్రభుత్వం చెప్పినట్లే ఒంటెద్దు పోకడ పోతున్నారని మండిపడ్డారు.మరోవైపు దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నా, నిరుద్యోగుల సమస్యలు పేరుకుపోతున్నా ప్రధాని మోడీ ఏమాత్రం స్పందించడం లేదని



విమర్శించారు. అలాగే అయోధ్య గుడి వ్యవహారంలో వందల కోట్ల రూపాయల చోరీ జరిగిందని, బిజెపి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే అయోధ్యకు మహా పాదయాత్ర చేసి, తమ తప్పులను ఒప్పుకుంటూ శ్రీరామచంద్రుడిని క్షమాపణ అడగాలని, ఈ అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ తరఫున ఆయన డిమాండ్ చేశారు.

విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పై అవగాహన కార్యక్రమం..

ప్రజా వాయిస్ ఎల్కతుర్తి

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని శాంతినగర్ సెయింట్ ఆన్స్ హై స్కూల్ విద్యార్థులకు బుధవారం ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎన్ హెచ్ ఓ) నరసింహారావు పోలీస్ స్టేషన్ పనితీరు, పోలీసుల విధులు చట్టాలు సామాజిక సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ హెచ్ ఓ నరసింహారావు మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి సంఘటనకు సంబంధించిన పూర్వాపరాలను తెలుసుకున్న తర్వాత కేసు స్వభావాన్ని బట్టి తగిన సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేస్తామని వివరించారు. పోలీస్ స్టేషన్లో ఎస్ఐ విధులు ఇతర పోలీస్ సిబ్బంది బాధ్యతలు ఫిర్యాదుల స్వీకరణ, కేసుల విచా రణ తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. పోలీస్ స్టేషన్ లోని వివిధ విభాగాలు ఎస్సై కార్యాలయం మహిళ విభాగం తదితర గదుల పనితీరును విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపిస్తూ వాటి విధుల గురించి తెలియజేశారు. ముఖ్యంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని తెలిసి తెలియని వయసులో చెడు అలవాట్లకు బానిస కావద్దని సూచించారు. ఎక్కడైనా గంజాయి విక్రయాలు వినియోగం లేదా అనుమానస్పద కార్యకలాపాలు కనిపించిన వెంటనే తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సెల్ ఫోన్లు సోషల్ మీడియా వినియోగంలో విద్యార్థులు అప్రమత్తంగా పాలని ఇన్స్టాగ్రామ్ వంటి సామాజిక మధ్యమాల్లో వ్యక్తిగత ఫోటోలు డీపీలు ఇతర సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఆన్లైన్ మోసాలు సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు పోలీస్ అధికారులను చూసి భయపడాల్సిన అవసరం లేదని పోలీసులు ప్రజల రక్షణ కోసమే పనిచేస్తారని ఒక తండ్రిలా ఆప్యాయంగా వివరిస్తూ వారిలో ధైర్యం చట్టాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా



విద్యార్థులకు పోలీస్ వ్యవస్థ పనితీరు చట్టాలపై అవగాహనతో పాటు మత్తు పదార్థాల నివారణ సైబర్ భద్రత సామాజిక బాధ్యతలపై విలువైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ తులసి, ఉపాధ్యాయులు మేకల శ్రీనివాస్, పోలీసులు హెడ్ కానిస్టేబుల్ విటల్ రావు, హెడ్ కానిస్టేబుల్ వెంకట్ రెడ్డి, ఉమెన్ కానిస్టేబుల్ సుప్రియ, ఉమెన్ కానిస్టేబుల్ మౌనిక, ఉమెన్ కానిస్టేబుల్ దివ్య, భగవాన్, అక్బర్, తదితరులు పాల్గొన్నారు.



నష్టపోయిన పంటలకు తక్షణమే పరిహారం అందించాలి

రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.. సర్పంచ్ పుట్టల సందీప్

ప్రజా వాయిస్ - వేములపల్లి

అకాల వర్షాలు, తుఫాన్ ప్రభావంతో పంటలు నేలవాలి తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని వేములపల్లి సర్పంచ్ పుట్టల సందీప్ కుమార్ కోరారు. బుధవారం వేములపల్లి శివారులో నేలవాలిన వరి పంట పొలాలను వ్యవసాయ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గత కొద్ది రోజులుగా తుఫాన్, ఈదురుగాలుల ప్రభావంతో గ్రామ శివారులోని పలు ప్రాంతాల్లో వరి పంటలు నేలవాలి నీట మునిగాయని తెలిపారు. పంట కోతకు సిద్ధమవుతున్న తరుణంలో ప్రకృతి వైపరీత్యం రైతుల ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. నీటిలో తడిసిన వరి ధాన్యం రంగు మారడంతో పాటు మొలకలు వస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆరుగాలం కష్టపడి, వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంట చేతికందే సమయంలో దెబ్బతినడం రైతులకు తీరని నష్టమని అన్నారు. ఇప్పటికే సాగు ఖర్చులతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఈ అకాల వర్షాలు మరింత భారంగా మారాయని పేర్కొన్నారు.సంబంధిత వ్యవసాయ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని సమగ్రంగా పరిశీలించి, నష్టపోయిన ప్రతి రైతు వివరాలను నమోదు చేయాలని కోరారు. నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపడంతో పాటు అర్హులైన రైతులకు ఎలాంటి జాప్యం లేకుండా నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు.రైతులు అధైర్యపడవద్దని, వారికి అండగా ఉండేందుకు తన వంతు కృషి చేస్తానని సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏవో షఫీ, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులకు రూ. 50 వేలు ఇవ్వాలి: కళావేణ శంకర్!

ఆదిలాబాద్ రూరల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో సీపీఐ ఆధ్వర్యంలో కరువు యాత్ర నిర్వహణ

ఎకరానికి కనీసం రెండు క్వింటాళ్ల దిగుబడి కూడా రాక పత్తి రైతులు ఆర్థికంగా కుదేలయ్యారని వెల్లడి.

జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రుణాల రీషెడ్యూల్, బీమా సాయం అందించాలని డిమాండ్

ప్రజా వాయిస్, / బోథ్ నియోజకవర్గం

ఆదిలాబాద్ జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించి పంట నష్టపోయిన ప్రతి రైతుకు రూ. 50 వేల ఆర్థిక సాయం అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ కళావేణ శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ జిల్లా కన్వీనర్ ఎస్. విలాస్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి, లోకారి, వన్‌వట్, లింగుగూడ తదితర గ్రామాల్లో కరువు యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన పత్తి చేలను స్వయంగా పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 20 మండలాల్లో కరువు పరిస్థితులు ఉన్నాయని అధికారులు పేర్కొన్నప్పటికీ క్షేత్రస్థాయిలో నష్టం అంతకంటే దారుణంగా ఉందన్నారు. ?ఒక ఎకరా పత్తికి 6 నుండి 12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా వర్షాభావం వల్ల క్వింటాలు రావడం కూడా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేసిన అప్పులు తీరక రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేక బృందాలతో సమగ్ర సర్వే చేయించి పంట నష్టపరిహారం, బీమా సొమ్ము అందజేయాలని కోరారు. అలాగే పంట రుణాలను రీషెడ్యూల్ చేసి పశుగ్రాసం, తాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు ఎస్. అరుణ్ కుమార్, బత్తుల గంగారెడ్డి, దేవేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



జాలుబాయి తండాలో అభివృద్ధికి మరో ముందడుగు..

నూతన గ్రామపంచాయతీ భవనానికి భూమిపూజ.

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి.

ప్రజా వాయిస్ / మిర్యాలగూడ: మిర్యాలగూడ మండలం జాలుబాయి తండాలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి భూమిపూజ నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, గ్రామపంచాయతీల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు. నూతన కార్యాలయ భవనం అందుబాటులోకి వస్తే ప్రజలకు మెరుగైన పాలనతో పాటు ప్రభుత్వ సేవలు మరింత చేరువవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

దేవాలయాల నిర్మాణానికి 2 కోట్ల 7 లక్షల రూపాయల నిధుల మంజూరు

ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్

నిర్మల్ జిల్లా ప్రజావాయిస్ ప్రతినిధి



నియోజకవర్గంలోని దేవాలయాల నిర్మాణానికి ప్రభుత్వం రెండు కోట్ల 7 లక్షల రూపాయలనిధులు మంజూరు చేస్తూ టెక్నికల్ సాంక్షన్ ఇవ్వడం జరిగిందని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ తెలియజేశారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముధోల్ నియోజక వర్గంలోని కామోల్ గ్రామంలోని సీతారామచంద్రస్వామి దేవాలయ కళ్యాణ మండప నిర్మాణానికి 50 లక్షల రూపాయలు, లోకేశ్వరం మండలంలోని పంచగుడి గ్రామంలో వీరభద్ర స్వామి ఆలయ నిర్మాణానికి 35 లక్షల రూపాయలు, అబ్దుల్లాపూర్ గ్రామంలో ముత్యాలమ్మ మహాలక్ష్మి ఆలయాల నిర్మాణాలకు 50 లక్షల రూపాయల నిధులు, లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ నిర్మాణానికి 22 లక్షల రూపాయల నిధులు, నరసాపూర్ మండలంలోని తురాటి శివాలయానికి 50 లక్షల రూపాయల నిధులు మంజూరు చేస్తూ టెక్నికల్ అనుమతి ఇచ్చిందన్నారు. ఆలయాల కమిటీలు మ్యాచింగ్ గ్రాంట్ ను చెల్లిస్తే, ప్రభుత్వం టెండర్ ప్రక్రియ ప్రారంభిస్తుందన్నారు.. ఆలయాల నిర్మాణానికి టెక్నికల్ గా అనుమతి ఇస్తూ నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, జిల్లా ఇంచార్జి మంత్రికి కృతజ్ఞతలు చెప్పారు.

ప్రజా వాయిస్

కార్పొరేషన్ పరిస్థితి పెనం మీదినుండి పొయ్యిలోకి...

- కరీంనగర్ లో ఒక పక్క డంప్ యార్డ్ మరోపక్క విలీన గ్రామాల సమస్య
- పాలకవర్గంలో బి ఆర్ ఎస్ లో కీలకంగా వ్యహరించన వాళ్ళే ఇప్పుడు బీజేపీలో ఉన్నారు
- చర్యలు తీసుకోవడంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ వెనుకాడటం ఎందుకు..?
- సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



ప్రజా వాయిస్,కరీంనగర్ (నవంబర్ 04):

మున్సిపల్ కార్పొరేషన్ పరిస్థితి పెనం మీది నుండి పొయ్యిలో పడ్డట్టయిందని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఎద్దేవా చేశారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలకవర్గంలో కీలకంగా వ్యవహరించిన వారే ఈరోజు బిజెపి పాలకవర్గంలో ఉన్నారని, నరమాంసానికి అలవాటు పడ్డ వారిని సాధువులుగా మారమంటే ఎలా సాధ్యమని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ ను ప్రశ్నించారు. ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, ముఖ్యంగా ఒకవైపు దంపు యార్డు సమస్య, మరొక వైపు విలీన గ్రామాల డివిజన్లలో అనేక సమస్యలు ఉన్నాయని, పౌర సేవలు సరిగా అందక ప్రజలు ఇబ్బందులు పడుతు ఉన్నారని అన్నారు. యుఐడిఎఫ్ కు పూర్తి నిధులు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని, యూసిఎఫ్ లో కూడా 75 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని ఇవే కాకుండా కరీంనగర్ అభివృద్ధికి మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, లక్ష్మణ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వం తరపున రావాల్సిన నిధులు మంజూరు చేయించడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. అలాగే బిఆర్ఎస్ నాయకుడి వద్ద నిజంగానే ఆడియో రికార్డులు ఉంటే వెంటనే ప్రజల ముందు పెట్టాలని అన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ గంట శ్రీనివాస్ నాయకులు గుండాటి శ్రీనివాస్ రెడ్డి, జీడి రమేష్, దన్న సింగ్, షబానా మహమ్మద్, దండి రవీందర్, మామిడి సత్యనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కస్తూర్భా హాస్టల్ మురుగునీటి సమస్యను పరిశీలించిన ఎమ్మెల్యే..

ప్రజా వాయిస్,మానకొండూర్(నవంబర్ 04):

కరీంనగర్ జిల్లా శ్రీనివాస్ నగర్ గ్రామంలోని కస్తూర్భా గాంధీ బాలికల హాస్టల్ నుంచి వెలువడుతున్న మురుగునీరు రహదారిపై ప్రవహిస్తూ స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యపై స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పందించారు. ఈ సమస్యను గ్రామస్థులు బుధవారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్వయంగా సంబంధిత ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఎరుకల శ్రీనివాస్, ఉప సర్పంచ్ మేకల మహేందర్, వార్డు సభ్యులు అనవేని రాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దీపావళిఅపార్ల నకిలీ లింకులతో జాగ్రత్త..

పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్..

ప్రజా వాయిస్, పాపన్నపేట



పాపన్నపేట మండల పరిధిలోని పాపన్నపేటలో స్థానిక పోలీస్ స్టేషన్లో పాపన్నపేట ఎస్సై శ్రీనివాస గౌడ్ మాట్లాడుతూ దీపావళిఅపార్ల పేరుతో సైబర్ నేరగాళ్లు పంపే నకిలీ లింకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఓటిపి, పిన్ నెంబర్లు, బ్యాంకు ఖాతా వివరాలు వెల్లడించవద్దని హెచ్చరించారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకూడదన్నారు. సైబర్ మూసానికి గురైతే వెంటనే 1930 కు కాల్ చేయాలని లేదా సైబర్ క్రైమ్ గవర్నమెంట్ డాట్ ఇన్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు.



కోటా-కె గ్రామ శివారులో అక్రమ గంజాయి సాగు తనిఖీ - నిందితుడి అరెస్ట్

పత్తి, కంది పంటల మధ్య రహస్యంగా పండిస్తున్న 11 గంజాయి మొక్కల సీజ్

స్వాధీనం చేసుకున్న మొక్కల నికర విలువ సుమారు రూ. 1.10 లక్షలు అంచనా

మాదకద్రవ్యాల సాగుకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలని ఎస్ఐ హెచ్చరిక

ప్రజా వాయిస్, / బోథ్ నియోజకవర్గం

బోథ్ మండలం సోనాల పరిధిలోని కోటా–కె గ్రామ శివారు వ్యవసాయ భూమిలో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న 48 ఏళ్ల శివరాం పెస్వే అనే వ్యక్తిని బోథ్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. విశ్వసనీయ వర్గాల ద్వారా అందిన సమాచారంతో ఎస్ఐ వి. పురుషోత్తం తమ సిబ్బందితో కలిసి ఆ భూమిలో తనిఖీలు నిర్వహించగా, ప్రధాన పంటల మధ్య అంతర పంటగా పెంచుతున్న 11 గంజాయి మొక్కలు వెలుగుచూశాయి. ఒక్కో మొక్క విలువను రూ. 10,000 చొప్పున లెక్కిస్తూ మొత్తం రూ. 1,10,000 విలువైన సరుకును స్వాధీనం చేసుకుని ఎన్డీపీఎస్ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. విచారణ సమయంలో తనకు ఉన్న అలవాటు వల్ల గతంలో కొనుగోలు చేసిన గంజాయిలోని విత్తనాలను సేకరించి సాగు ప్రారంభించినట్లు నిందితుడు అంగీకరించాడని పోలీసులు ప్రకటించారు. గంజాయి అక్రమ సాగు, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే తక్షణమే తమకు చేరవేయాలని ఎస్ఐ ప్రజలను కోరారు. మాదకద్రవ్యాల సాగుకు పాల్పడే రైతులకు ప్రభుత్వ పథకాలను రద్దు చేయడానికి సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా మత్తు పదార్థాల రహిత వాతావరణం ఏర్పడేలా ప్రజలు పోలీసు వ్యవస్థకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన..

ప్రజా వాయిస్, శంకరపట్నం



(నవంబర్ 04)

సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని శంకరపట్నం ఎస్సై సూచించారు. సైబర్ జాగరూకత దివస్ సందర్భంగా కరీంనగర్ జిల్లా కన్నాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేశవపట్నం పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా దుర్వినియోగం, డిజిటల్ అరెస్ట్ మోసాలు, నకిలీ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల గురించి విద్యార్థులకు వివరించారు. అపరిచితులు అడిగినా ఓ్కా, ూవీ్రxచీ, జఎఒ వివరాలు వెల్లడించకూడదని, తెలియని లింకులను క్లిక్ చేయకూడదని సూచించారు. UPI చెల్లింపుల్లో డబ్బులు స్వీకరించడానికి్రxచీ అవసరం లేదని వివరించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని, సైబర్ వేధింపులు ఎదురైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని, ఽషఽ.ఽఎఎవతీఽతీఅఎవ.స్ర్తశీజ.అఅ ద్వారా ఫిర్యాదు చేయాలని పోలీసులు తెలిపారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ శాఖపై ఆరోపణలు అవాస్తవం

విద్యుత్ శాఖ ఎస్సీ నారాయణ నాయక్..

ప్రజా వాయిస్,మెదక్



మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చిన తిరుపతి కిషన్ మృతికి విద్యుత్ శాఖకు ఎలాంటి సంబంధం లేదని విద్యుత్ శాఖ ఎస్ ఈ నారాయణ నాయక్ స్పష్టం చేశారు. డయాలసిస్ కేంద్రానికి వెళ్లే కేబుల్ లో సమస్య తలెత్తగా, మరమ్మత్తులో సమయంలో ఆస్పత్రి జనరేటర్ ను కూడా నిలిపివేశారని తెలిపారు. జనరేటర్ ను సకాలంలో ప్రారంభించి విద్యుత్ పునరుద్ధరించకపోవడం ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యమని, విద్యుత్ శాఖ తప్పిదం లేదని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా విద్యుత్ శాఖ పై ఆరోపణలు అవాస్తవం అని ఆయన స్పష్టం చేశారు

గుడిహత్నూర్ సీతాగోంది సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం - యువకుడు అక్కడికక్కడే దుర్మరణం

జాతీయ రహదారిపై వేగంగా ప్రయాణిస్తున్న క్రమంలో

బుధవారం చోటుచేసుకున్న ఘోర ప్రమాదం

స్థానికులు వెంటనే స్పందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలింపు

ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు మరియు మృతుడి పూర్తి వివరాలపై పోలీసుల ఆరా.

ప్రజా వాయిస్, /ఆదిలాబాద్



గుడిహత్నూర్ మండలం సీతాగోంది గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం తీవ్ర నిరాశ పరిచే ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళ్తున్న వాహనం ప్రమాదానికి గురికావడంతో ఒక యువకుడు సంఘటనా స్థలంలోనే తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదం జరిగిన వెంటనే గమనించిన స్థానిక ప్రయాణికులు, గ్రామస్థులు ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని శవపరీక్ష (పోస్టుమార్టం) నిమిత్తం ఆదిలాబాద్‌లోని రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించేలా చర్యలు చేపట్టారు.

?అయితే ఈ ప్రమాదం ఏ విధంగా జరిగింది, ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొట్టిందా లేక అదుపుతప్పి బోల్తా పడిందా అనే విషయంతో పాటు ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని అధికారులు వెల్లడించారు. ప్రమాదంలో మరణించిన యువకుడు ఏ ప్రాంతానికి చెందినవాడు, అతని పేరు ఏమిటి అనే పూర్తి వివరాలను సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఈ ఘటనపై గుడిహత్నూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు



అన్నదాతకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం..

- మూడు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- రైతుల పంటకు భరోసా కల్పించడమే లక్ష్యం
- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

ప్రజా వాయిస్, మానకొండూరు (నవంబర్ 04):

రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను విక్రయించుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఈ క్రమంలో మానకొండూరు నియోజకవర్గంలోని మూడు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. మానకొండూరు మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ యార్డుతో పాటు మంజంపల్లి, జగ్గయ్యపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మానకొండూరు శాసనసభ్యులు, టీపీసీసీ ఎస్సీ సెల్ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ధాన్యం విక్రయాల్లో ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా సౌకర్యాలు కల్పించమన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ నిబంధనల ప్రకారం విక్రయించుకోవాలని సూచించారు. గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు రవాణా భారం తగ్గడంతో పాటు ధాన్యం విక్రయ ప్రక్రియ మరింత సులభతరం కానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు పలుక బల్పం పంపిణీ చేసిన మంత్రి జూపల్లి

ప్రతి ఒక్కరికీ చదవడం, రాయడం రావాలన్నదే నా ఆకాంక్ష మంత్రి జూపల్లి కృష్ణారావు

నిరక్షరాస్య మహిళలకు ప్రత్యేక తరగతులు..

ఉదయం, సాయంత్రం గంట చొప్పున బోధన

మహిళల్లో చదువుపై ఆసక్తి పెంచేందుకు రూ.5 వేల నగదు బహుమతి ప్రకటన

ప్రజా వాయిస్.. వీపనగండ్ల

మహిళలు అక్షరాస్యులైనప్పుడే ఆత్మవిశ్వాసంతో పాటు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మహిళలు విద్యావంతులైతే కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ చదవడం, రాయడం రావాలన్నదే తన ఆకాంక్ష అని తెలిపారు. బుధవారం కొల్లాపూర్ నియోజకవర్గం పానగల్ మండలం తెల్లరాళ్లపల్లి గ్రామంలో నిరక్షరాస్య మహిళలకు చదువు నేర్చుకునేందుకు మంత్రి పలకలు, బలపాలు పంపిణీ చేశారు. వీటి కొనుగోలుకు సంబంధించి గతంలోనే రూ. 10 వేల ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. మహిళలకు అక్షరజ్ఞానం అందించే కార్యక్రమం నిరంతర ప్రక్రియగా కొనసాగాలని మంత్రి సూచించారు. ఇందులో భాగంగా గ్రామంలోని మహిళలకు ప్రతిరోజూ ఉదయం గంట, సాయంత్రం గంట చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు ఉపాధ్యాయులను నియమించాలని సర్పంచ్ జంబలయ్యకు ఆదేశించారు. ప్రత్యేక తరగతుల నిర్వహణకు తన వంతు సహాయంగా రూ. 20 వేల ఆర్థిక సాయం అందించారు. చదువుకు వయసుతో సంబంధం లేదని, ఆసక్తి, పట్టుదల ఉంటే ఎవరైనా విద్యావంతులు కావచ్చని మంత్రి పేర్కొన్నారు. మహిళల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించేందుకు మరో ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. చదవడం, రాయడం ముందుగా నేర్చుకునే మహిళకు రూ. 5 వేల నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు మండల నాయకులు, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు



ఉద్యమకారుని కుటుంబాన్ని పరామర్శించిన నాగుర్ల వెంకన్న

మృతుని భౌతికకాయానికి పూలమాలతో నివాళులు

ప్రజా వాయిస్/ఆత్మకూరు హన్మకొండ

హన్మకొండ జిల్లా ఆత్మకూరు మండలంలోని గూడెప్పాడు గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు పోరెడ్డి లక్ష్మారెడ్డి చనిపోయిన విషయం తెలుసుకున్న రాష్ట్ర రుణ విమోచన కమిటీ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు ఆయన భౌతిక గాయానికి పూలదండ వేసి నివాళి అర్పించి లక్ష్మారెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. రైతు రుణ విమోచన మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లక్ష్మారెడ్డి తెలంగాణ ఉద్యమం లో పాల్గొన్నాడని గుర్తు చేశారు. లక్ష్మారెడ్డి మృతి ఉద్యమానికి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్సడ్ల సదానందం మండల అధ్యక్షులు ఎండి బాబుమియా చిరు మండల ప్రధాన కార్యదర్శి రాజన్న మాజీ ఎంపిటిసి బీరం రజనీకర్ రెడ్డి మండల నాయకులు అంకతి రవి, మంద ఎల్లయ్య, భాస్కర్ వీరేశం, సార రాజు ,సెల్పూరి రాజేందర్ ,బలభద్ర కిషోర్ వంగర సమ్మయ్య, దేవేందర్ లింగమూర్తి ,పాలకుర్తి మల్లయ్య , బలబద్ర రవి, నమతాబాజీ సుమన్, బలబద్ర రాజేందర్ తదితరులు పాల్గొన్నారు



జీపీఓల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి వినతి

సొంత నియోజకవర్గాలకు బదిలీలు, వీఆర్ఏ వ్యవస్థ పునరుద్ధరణ, అసోసియేషన్ భవన నిర్మాణం, ఖాళీ పోస్టుల భర్తీకి విజ్ఞప్తి

ప్రజా వాయిస్, మిర్యాలగూడ:

మిర్యాలగూడ డివిజన్ గ్రామ పాలన అధికారులు (జీపీఓలు) ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నల్లగొండ జిల్లా గ్రామ పాలన అధికారుల సంఘం అధ్యక్షులు రంగరాజు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జీపీఓల ప్రతినిధి బృందం మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఇతర నియోజకవర్గాల్లో విధులు నిర్వహిస్తున్న జీపీఓలను వారి సొంత నియోజకవర్గాలకు బదిలీ చేయాలని, రెవెన్యూ గ్రామాల్లో కొనసాగుతున్న రీ సర్వే నేపథ్యంలో క్షేత్రస్థాయిలో సమగ్ర సమాచారం అందుబాటులో లేకపోవడంతో గతంలో ఉన్న వీఆర్ఏ వ్యవస్థను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. అదేవిధంగా మిర్యాలగూడ డివిజన్‌లో గ్రామ పాలన అధికారుల సంఘానికి ప్రత్యేక భవనాన్ని నిర్మించాలని, జనాభా ప్రాతిపదికన పట్టణ ప్రాంతాల్లో జీపీఓ పోస్టులను కేటాయించడంతో పాటు మిగిలిన ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బాడీ కమిటీ సభ్యులు దాసరి పీరయ్య, రవి, నల్లగొండ జిల్లా అధ్యక్షులు రంగరాజు శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ నజీర్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు భద్రం రాజు నీరజ, ఉపాధ్యక్షులు ఈద శ్రీనివాస్, మిర్యాలగూడ మండల అధ్యక్షులు పగిడిపాటి నవీన్ కుమార్, వేములపల్లి మండల అధ్యక్షులు ఉబ్బని యాదగిరి, మాడుగులపల్లి మండలం నుంచి ఇంద్రపల్లి ప్రశాంత్, జీపీఓలు కోరే సైదులు, దూపాటి రాంబాబు, భాష తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరై విజయవంతం చేసిన ప్రతి ఒక్క జీపీఓకు మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షులు బూరుగు రూపురావు, ప్రధాన కార్యదర్శి కోడి రెక్క సంపత్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



నార్సింగిలో 552 కొత్త రేషన్ కార్డుల పంపిణీ..

ప్రజా వాయిస్, పాపన్నపేట

పాపన్నపేట మండల పరిధిలోని నార్సింగ్ గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన 552 కొత్త రేషన్ కార్డులను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మల్లేశం మాట్లాడుతూ, రేషన్ కార్డులు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందినందుకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగ్ సర్పంచ్, మరియు గ్రామస్తులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బడిలో ఉండాల్సిన బాల్యం.. చెత్తకుప్పల పాలు!

పాపన్నపేట మండల వ్యాప్తంగా పేదరికంలో నలుగుతున్న చిన్నారులు.... జిల్లాలో అవగాహన సదస్సులు లేకనే ఇలాంటి సంఘటనలు.....

ప్రజా వాయిస్,పాపన్నపేట,

చేతిలో పుస్తకాలు, పెన్నులు పట్టుకుని పాఠశాలకు వెళ్లాల్సిన వయసులో, ఆ చిన్నారులు చెత్తకుప్పల వద్ద ప్లాస్టిక్ సీసాలు, పాత కాగితాలు ఏరుకుంటూ కనిపిస్తున్నారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో బాలకార్మిక వ్యవస్థ ఇంకా కొనసాగుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

పసిముఖాల్లో కనిపించని నవ్వులు:

పాపన్నపేట మండల పరిధిలోని ప్రధాన చౌరస్తాలు, మార్కెట్ ప్రాంగణాలు, నిర్జన ప్రదేశాల్లో ఉన్న చెత్తకుప్పల వద్ద ఉదయమే చిన్న పిల్లలు సంచులతో ప్రత్యక్షమవుతున్నారు. చదువుకోవాల్సిన వయసులో కుటుంబ పేదరికం, తల్లిదండ్రుల నిరక్షరాస్యత, ఆదరణ లేకపోవడం వల్ల ఈ చిన్నారులు చెత్త ఏరుకునే పనిలోకి దిగుతున్నారు. రోజంతా కష్టపడితే వచ్చే కొన్ని రూపాయలతోనే తమ కడుపు నింపుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

అనారోగ్యం పాలవుతున్న బాల్యం:

దుర్వాసన వెదజల్లే చెత్తకుప్పల్లో తవ్వడం వల్ల ఈ పిల్లలు తీవ్రమైన చర్మ రోగాలు, శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. కనీసం కాళ్లకు చెప్పులు, చేతులకు గ్లౌజులు కూడా లేకుండా మురికికూపాల్లో పనిచేయడం వల్ల తీవ్ర ఆరోగ్య ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు.

కంటితుడుపు చర్యలేనా?

ప్రభుత్వాలు ఏటా 'ఆపరేషన్ ముస్కాన్', 'ఆపరేషన్ స్మైల్' వంటి కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో సమస్య పూర్తిగా సమసిపోవడం లేదు. అధికారులు తనిఖీలు చేసిన సమయంలో మాత్రమే మార్పు



కనిపిస్తున్నా, ఆ తర్వాత మళ్లీ పరిస్థితి మొదటికి వస్తోంది.

ప్రజలు, అధికారుల బాధ్యత:

పాపన్నపేట మండలంలో బాలకార్మిక వ్యవస్థను అరికట్టడానికి విద్యాశాఖ, ఐసీడీఎస్ కార్మిక శాఖ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక చర్యలు తీసుకొని బాల కార్మిక వ్యవస్థకు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్ టి ఐ అమలులో శాతవాహన విశ్వవిద్యాలయం నిర్లక్ష్యం..

- **అడిగితే అసంపూర్తి సమాచారం.. కమిషన్ ఆదేశాలిచ్చినా అమలులో జాప్యం**
- **ఆర్ టి ఐ చట్టాన్ని బేఖాతరు చేసే బాధ్యులపై జరిమానా, క్రమ-శిక్షణ చర్యలు తీసుకోవాలి**
- **విశ్వవిద్యాలయ అధికారుల తీరుపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్**

ప్రజా వాయిస్, కరీంనగర్ (నవంబర్ 04):

ప్రజలకు ప్రభుత్వ వ్యవహారాల్లో పారదర్శకత, అధికారులకు జవాబుదారీతనం కల్పించాల్సిన సమాచార హక్కు చట్టం – 2005ను శాతవాహన విశ్వవిద్యాలయ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. చట్టబద్ధంగా కోరిన సమాచారాన్ని నిర్ణీత గడువులో పూర్తిస్థాయిలో అందించకుండా అసంపూర్తి సమాధానాలతో కాలయాపన చేయడం, రాష్ట్ర సమాచార కమిషన్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ వాటిని అమలు చేయడంలో జాప్యం చేయడం అధికారుల బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోందని అనిల్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.సమాచారం అడిగిన పౌరుడికి సమాధానం చెప్పాల్సిన అధికారులు, చట్టం నిర్దేశించిన బాధ్యతలను విస్మరిస్తే ఇక సామాన్యుడికి పారదర్శక పాలన ఎలా అందుతుందని ఆయన ప్రశ్నించారు. సమాచార హక్కు చట్టం కేవలం దరఖాస్తులు స్వీకరించి, ఏదో ఒక సమాధానం ఇచ్చి చేతులు దులుపుకునే వ్యవస్థ కాదని, కోరిన సమాచారాన్ని చట్ట నిబంధనలకు అనుగుణంగా అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు.



కమిషన్ ఆదేశాలకూ విలువ లేదా..?

శాతవాహన విశ్వవిద్యాలయంలో 2021లో మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ సంకషాల మల్లేష్ పరిపాలనా కాలం నుంచి నేటి వరకు సమాచార హక్కు చట్టం అమలు తీరుపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. తాను కోరిన సమాచారాన్ని పూర్తిస్థాయిలో అందించకుండా అసంపూర్తి సమాధానాలు ఇవ్వడం, సమాచార కమిషన్ ఆదేశాలు ఉన్నప్పటికీ వాటి అమలులో జాప్యం చేయడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. రాష్ట్ర సమాచార కమిషన్ ఆదేశాలు కూడా అమలు కాకపోతే, చట్టాన్ని ఆశ్రయించిన పౌరులకు న్యాయం ఎక్కడ లభిస్తుందని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల దరఖాస్తుదారులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ తక్షణమే స్పందించాలి..

సమాచార హక్కు చట్టం ప్రజలకు కల్పించిన హక్కు. దానిని అమలు చేయడం అధికారులపై ఉన్న చట్టబద్ధమైన బాధ్యత. విశ్వవిద్యాలయం ప్రభుత్వ నిధులతో నడిచే ప్రజా సంస్థగా పారదర్శకత, జవాబుదారీతనానికి ఆదర్శంగా నిలవాల్సి ఉండగా, అక్కడే సమాచార హక్కు అమలుపై ఆరోపణలు రావడం ఆందోళనకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఉన్నత విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి శాతవాహన విశ్వవిద్యాలయంలో 2021 నుంచి సమాచార హక్కు చట్టం అమలు తీరుపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమాచార కమిషన్ జారీ చేసిన ఆదేశాల అమలు స్థితిని పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న సమాచారాన్ని తక్షణమే అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమాచారాన్ని ఉద్దేశపూర్వకంగా నిలిపివేసినట్లు లేదా చట్టాన్ని ఉల్లంఘించినట్లు విచారణలో తేలితే బాధ్యులైన అధికారులపై సెక్షన్ 20 ప్రకారం జరిమానా విధించే చర్యలు చేపట్టాలని, అవసరమైతే క్రమశిక్షణా చర్యలు కూడా తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నందులపల్లి రైస్ మిల్లులో రూ.4.34 కోట్ల బియ్యం మాయం!

శ్రీ లక్ష్మీ శ్రీనివాస రైస్ మిల్లు సీజ్.. విజిలెన్స్, సివిల్ సప్లైస్ అధికారుల సంయుక్త తనిఖీల్లో భారీ అక్రమాలు వెలుగులోకి ప్రభుత్వ ధాన్యానికి భారీగా గండి.. రికార్డులు, నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు



ప్రజా వాయిస్ నెన్నెల/బెల్లంపల్లి

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం నేన్నెల్ మండలంలోని ప్రభుత్వ ధాన్యం మిల్లింగ్ వ్యవహారంలో భారీ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం నందులపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీ శ్రీనివాస రైస్ మిల్లులో సుమారు రూ.4.34 కోట్ల విలువైన బియ్యం అక్రమాలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. ప్రభుత్వానికి చెందాల్సిన ధాన్యం, బియ్యం నిల్వల విషయంలో భారీ వ్యత్యాసాలు ఉన్నట్లు తనిఖీల్లో బయటపడటంతో సంబంధిత అధికారులు మిల్లును సీజ్ చేశారు. ఈ ఘటన నెన్నెల మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

అధికారుల సంయుక్త తనిఖీలు.. వెలుగులోకి భారీ వ్యవహారం

ప్రభుత్వం రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు కేటాయించి, మిల్లింగ్ అనంతరం నిర్ణీత నిబంధనల ప్రకారం బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉంటుంది. అయితే నందులపల్లి శ్రీ లక్ష్మీ శ్రీనివాస రైస్ మిల్లులో ప్రభుత్వానికి సంబంధించిన బియ్యం నిల్వలు, మిల్లింగ్ వివరాలు, రికార్డులను పరిశీలించిన సమయంలో భారీ మొత్తంలో తేడాలు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కరీంనగర్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సివిల్ సప్లైస్, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా మిల్లుపై తనిఖీలు నిర్వహించారు. మిల్లులో ఉన్న ధాన్యం నిల్వలు, బియ్యం నిల్వలు, రికార్డులు, ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యం వివరాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో సుమారు



రూ.4.34 కోట్ల విలువైన బియ్యానికి సంబంధించి అక్రమాలు జరిగినట్లు గుర్తించడంతో మిల్లును సీజ్ చేస్తూ చర్యలు చేపట్టారు.

తనిఖీల్లో పాల్గొన్న అధికారులు వీరే..

కరీంనగర్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌కు చెందిన



ఐఓపీ ప్రశాంత్ రావు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ బృందంలో మంచిర్యాల జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్ శ్రీకళ, నెన్నెల ఎంఆర్ఓ శ్రీనివాస్, డీటీ సివిల్ సప్లైస్ శ్రీనివాస్, సివిల్ సప్లైస్ ఇన్‌స్పెక్టర్ భూమేష్, నెన్నెల ఆర్ఐ సులోచన, జీపీఓలు సుజాత, రజిత, పంచాయతీ కార్యదర్శి సరిత తదితర అధికారులు పాల్గొన్నారు. అధికారులు మిల్లులోని నిల్వలను పరిశీలించడంతో పాటు సంబంధిత రికార్డులను తనిఖీ చేసి, ప్రభుత్వానికి సంబంధించిన బియ్యం వివరాలను సేకరించారు. తనిఖీల అనంతరం అక్రమాల తీవ్రతను పరిగణనలోకి తీసుకుని మిల్లును సీజ్ చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించి పూర్తి వివరాలను సేకరించి తదుపరి చర్యలు తీసుకునేందుకు అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు.

ప్రభుత్వ ధాన్యం పక్కదారి పడితే సహించేది లేదు!

రైతుల కష్టానికి ప్రతిఫలంగా ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ధాన్యం ప్రజాధనంతో ముడిపడి ఉంటుంది. ప్రభుత్వానికి చేరాల్సిన బియ్యం విషయంలో అక్రమాలు జరిగితే అది ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించడమే కాకుండా ప్రజా పంపిణీ వ్యవస్థపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ఇలాంటి వ్యవహారాలపై సంబంధిత శాఖలు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. నందులపల్లి రైస్ మిల్లులో రూ.4.34 కోట్ల విలువైన బియ్యం వ్యవహారం వెలుగులోకి రావడంతో ఈ అక్రమాల వెనుక ఎవరెవరి పాత్ర ఉంది? ఎంతమేరకు ప్రభుత్వ బియ్యం పక్కదారి పట్టింది? ఈ వ్యవహారంలో ఇంకా ఎవరైనా సంబంధిత వ్యక్తులు ఉన్నారా? అనే అంశాలపై స్థానికంగా చర్చ జరుగుతోంది. మొత్తంగా నందులపల్లి శ్రీ లక్ష్మీ శ్రీనివాస రైస్ మిల్లులో వెలుగుచూసిన ఈ భారీ వ్యవహారం నెన్నెల మండలంలో కలకలం రేపుతోంది. అధికారులు చేపట్టిన తదుపరి విచారణలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వ ధాన్యం అక్రమాలపై విచారణ పూర్తిచేసి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ప్రజా వాయిస్

ప్రజా వాణి సమస్యల పైన
స్పందించిన పారనరఫరాల శాఖ